

నేలటూరులో ప్రభుత్వ భూములు ఆక్రమించి సాగు చేసిన దృశ్యం

రాష్ట్రోత్సవంగా సీపీ బ్రౌన్ జయంతి

● ఆదేశాలు జారీ చేసిన ప్రభుత్వం



కడప ఎడ్యుకేషన్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): తెలుగు భాష, సాహిత్య పునరుజ్జీవనానికి విశేష కృషి చేసిన బ్రిటీష్ పండితుడు చార్లెస్ ఫిలిప్ బ్రౌన్ (సీపీ బ్రౌన్) జయంతిని రాష్ట్రోత్సవంగా నిర్వహించాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు యువ సంక్షేమ, పర్యాటక, సాంస్కృతిక శాఖ జీఓ ఎంఎస్ నెం.40 బుధవారం ఉత్తర్వులు జారీ చేసింది. విజయవాడ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మక, సాంస్కృతిక కమిషన్ ప్రధాన కార్యనిర్వాహక అధికారి పంపిన ప్రతిపాదనను పరిశీలించిన అనంతరం ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. 1798 నవంబర్ 10న కోల్‌కతాలో జన్మించిన సీపీ బ్రౌన్ అప్పట్లో కడపలో పనిచేశారు. ఇక్కడ పనిచేస్తున్న సమయంలోనే తెలుగు భాష పునరుజ్జీవనానికి తన జీవితాన్ని అంకితం చేశారు. తన సంపాదన అంతా తెలుగు భాషాభివృద్ధికి ఖర్చు చేశారు. తెలుగు పునరుజ్జీవన యుగ పితామహుడు అని ఆయనకు లభించిన బిరుదు సార్థకమైంది. 1855లో ప్రభుత్వసేవల నుంచి వైదొలిగిన ఆయన, లండన్ విశ్వవిద్యాలయంలో తెలుగు ప్రొఫెసర్‌గా పనిచేసి 1884 డిసెంబరు 12న కన్నుమూశారు. ప్రతి సంవత్సరం నవంబరు 10న సీపీ బ్రౌన్ జయంతిని రాష్ట్రోత్సవంగా నిర్వహించేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అజయ్‌జైన్ ఉత్తర్వుల్లో తెలిపారు.

కుందూ పరవళ్లు


సీతారామపురం గ్రామం వద్ద బ్రిడ్జిపై పారుతున్న కుందూ

చాపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): చాపాడు మండలంలో కుందూనది పరవళ్లు తొక్కుతోంది. బుధవారం సాయంత్రం ఆరు గంటల నుంచి పైతట్టు ప్రాంతాల వర్షపునీరు భారీగా వచ్చి చేరింది. దీంతో కుందూ నదిలో సుమారు 39 వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. తహశీల్దారు రమాకుమారి కుందూ నదిని ఆనుకుని ఉన్న అన్నవరం, సీతారామపురం, వెదురూరు, అల్లాడుపల్లె గ్రామాల వద్ద గ్రామ నౌకర్లను నియమించారు. ప్రజలు కుందూ నదిలోకి వెళ్లవద్దని ఆమె హెచ్చరించారు.

పరవళ్లు తొక్కిన సగిలేరు


నర్సాపురం వద్ద సగిలేరు ఉధృతి

కాశినాయన, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి:) మొంథా తుఫాన్‌తో కాశినాయన మండలంలో సగిలేరు పరవళ్లు తొక్కింది. నీటి ఉధృతికి ఉప్పలూరు వద్ద నదికి ఇరువైపులా ఉన్న పొలాలు కోతకు గురయ్యాయి. సగిలేరు ఒడ్డులో ఏర్పాటు చేసుకున్న పలువురి విద్యుత్ మోటార్లు నీటిలో కొట్టుకుపోయాయని రైతులు తెలిపారు. చెన్నవరం సమీపంలో సగిలేరుపై ఉన్న లోలెవల్ బ్రిడ్జిపై నీరు అధికంగా ప్రవహించడంతో బుధవారం రాకపోకలు స్తంభించిపోయాయి. దాదాపు 10 గ్రామాల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. చెన్నవరం గ్రామ సచివాలయంలో సర్పంచ్ చెన్నుపల్లె వెంకటరెడ్డి బాధితులకు అన్నదానం ఏర్పాటుచేశారు.

పోరుమామిళ్ల చెరువును పరిశీలించిన కలెక్టర్



పోరుమామిళ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోరుమామిళ్ల చెరువును బుధవారం సాయంత్రం కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలించారు. చెరువుకు సంబంధిం చి వివరాలను అధికారులతో అడిగి తెలుసుకున్నారు. దమ్మనపల్లె పోరుమామిళ్ల ప్రాంతానికి చెందిన రైతులు నీట మునిగిన వరికి నష్టపరిహారం చెల్లించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఆర్డీవో చంద్రమోమన్, తహశీల్దారు చంద్రశేఖర్‌రెడ్డి, సీఐ శ్రీనివాసులు, ఎంపీడీవో ఉపేంద్రరెడ్డి, ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.

కబ్జాల్లో బ్రహ్మజ్ఞానం

● వైసీపీ హయాంలో రూ.200 కోట్ల భూ కుంభకోణం
● బ్రహ్మంగారిమఠంలో 4,846 ఎకరాలు ఆక్రమణ
● వాగులు, వంకలు, కొండలనూ వదల్లేదు
● అక్రమాలకు సహకరించిన అధికారులు
● అడ్డదారిలో ఆన్‌లైన్‌లోకి


పలుగురాళ్లపల్లెలో ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూములు

ఐదేళ్ల వైసీపీ హయాంలో జిల్లాలో మునుపెన్నడూ లేని విధంగా భూకబ్జాలు జరిగాయి. కాలజ్ఞాన తత్వవేత్త బ్రహ్మంగారు వెలసిన బ్రహ్మంగారిమఠం మండలంలో వైసీపీకి చెందిన వారు కొండలు, గుట్టలు, వాగులను కూడా అడ్డదారిలో రెవెన్యూ అధికారులతో కుమ్మక్కై ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకున్నారు. ఇలా సుమారు రూ.200 కోట్ల విలువచేసే భూములను కొట్టేసిన భూ కుంభకోణం ఇప్పుడు వెలుగుచూసింది. వైసీపీ మూకలు కొట్టేసింది వందో, రెండు వందల ఎకరాలో కాదు.. ఏకంగా 4,846 ఎకరాలు అడ్డగోలుగా ఆక్రమించేశారు.

(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో భూకబ్జాలపై కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ ఉక్కుపాదం మోపుతున్నారు. ఇప్పటికే ఆక్రమణకు గురైన వందలాది ఎకరాలను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. బద్వేలు రెవెన్యూ డివిజనులో అన్యాక్రాంతానికి గురయిన భూములను ఆర్డీవో చంద్రమోహన్ క్షుణ్ణంగా విచారణ జరిపి ఆక్రమణల నుంచి విముక్తి కల్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అదే డివిజనులోని బ్రహ్మంగారిమఠం మండలంలో వైసీపీ హయాంలో జరిగిన భూకుంభకోణం ఇప్పుడు బద్దలైంది. ఆక్రమించిన భూములన్నీ ఆర్ఎస్ఆర్ ప్రకారం అటవి, కొండలుగా నమోదై ఉంటే.. కొన్ని సర్వేనెంబర్లలోని ప్రభుత్వ భూములను నిబంధనలకు విరుద్ధంగా డీకేటీ పట్టాలు తీసుకుని ఆన్‌లైన్‌లో ఎక్కించుకున్నారు. బ్రహ్మంసాగర్ రిజర్వాయరు ఉండడంతో బి.మఠంలో భూముల ధరలకు రెక్కలొచ్చాయి. అక్కడ ఎకరా ఎంత తక్కువ వేసుకున్నా రూ.10 లక్షల పైమాటే. ఆక్రమణకు గురైన భూములు ఎంత తక్కువ అనుకున్నా రూ.200 కోట్లు మేర ఉంటుందంటున్నారు. ఇక్కడ జరిగిన భూ ఆక్రమణలపై ఇటీవల ఎమ్మెల్యే పుట్టా సుధాకర్‌యాదవ్ బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్‌కు ఫిర్యాదు చేశారు.

కొండలనూ వదల్లేదు

● దిగువ నేలటూరు రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 165/1లో ఉన్న 20 ఎకరాలు ఆర్ఎస్ఆర్ ప్రకారం ప్రభుత్వ భూమిగా ఉంది. సర్వే నెంబర్ 183/1లో ఉన్న 6.8 ఎకరాలు ఆర్ఎస్ఆర్ వాగుగా ఉంది. వీటిని కూడా ఆన్‌లైన్‌లో ఎక్కించారు. మరో సర్వే నెంబర్ 448/2లో 10 ఎకరాలు ఆర్ఎస్ఆర్ ప్రకారం అడవిగా నమోదైంది. సర్వే నెంబర్ 571 నుంచి 1వ లెటరు, 2వ లెటరు, 3వ లెటరు నుంచి 10వ లెటరు వరకు ఉన్న భూములు ఆర్ఎస్ఆర్‌లో కొండగా ఉంది. అలాగే 10వ లెటరు నుంచి 577/66 వరకు కొండగా ఉంది. 571 నుంచి 136వ లెటరు వరకు కొండగానే ఉంది. ఇక్కడ పట్టాలు ఇవ్వకూడదు. అయినప్పటికీ ఆక్రమించారు. పట్టాలు పుట్టించారు.

● బి.నరసింహాపురం సర్వే నెంబర్‌లో 1లో ఆర్ఎస్ఆర్ ప్రకారం వాగు ఉంది. ఇవీ ఆన్‌లైన్ చేసుకున్నారు. సర్వే నెంబర్లు 14, 16లో వాగు ఉంది. మరికొన్ని సర్వేనెంబర్లలో అసైన్‌మెంటు కమిటీ లేకుండానే పట్టాలు ఇచ్చేశారు.

● రేకలకుంట రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 419లో వాగు ఉంది. ఇక్కడా పట్టాలు ఇచ్చారు. సర్వే నెంబర్ 743/10, 823/1, 840/6 మరికొన్ని లెటర్లలో కొండ ఉంది. ఇక్కడ కూడా అసైన్‌మెంటు లేకుండానే రికార్డుల్లోకి ఎక్కించారు.

● నాగిశెట్టిపల్లె రెవెన్యూ పొలం సర్వే నెంబర్ 4-20 నుంచి 16-14, 17-14 నుంచి మరికొన్ని సర్వేనెంబర్లులో అసైన్‌మెంటు లేకుండానే రికార్డుల్లో ఎక్కించారు. 40/ఎలో సర్వే నెంబర్ 95లో ఆర్ఎస్ఆర్ ప్రకారం వంక ఉంది.

● పలుగురాళ్లపల్లెలో భూములున్న వారికే మళ్లీ డీకేటీ పట్టాలు ఇచ్చారు. సర్వే నెంబర్ 20, 81 ఇతర నెంబర్లలో దేవస్థాన భూములున్నాయి. అవి ఆక్రమణకు గురయ్యాయి.

● సోమిరెడ్డిపల్లె సర్వే నెంబర్ 370-5 నుంచి 370/13 వరకు అసైన్‌మెంటు కమిటీ లేకుండానే అడ్డగోలుగా ఎక్కించినట్లు ఆరోపణలున్నాయి.

● దిరసవంచలో కూడా అడ్డగోలుగా అసైన్‌మెంటు కమిటీ లేకుండానే స్థానికేతరుల పేర్లతో భూములు ఆన్‌లైన్‌లో ఎక్కించారు.

● ఎగువ నేలటూరులో సర్వే నెంబర్ 219/2 ఎస్16 నుంచి 219/2 ఎస్2 వరకు కొండగా నమోదైంది. ఇదంతా ఆక్రమించారు.

● అగ్రహారంలో సర్వే నెంబర్ 36/9 నుంచి 43/2 వరకు పలు సర్వే నెంబర్లలో ప్రభుత్వ భూమి ఉంది. ఇక్కడా ఆక్రమించారు. వాగులు వంకలు కొండలతో పాటు అసైన్‌మెంటు కమిటీ లేకుండానే భూములు ఆన్‌లైన్‌లోకి ఎక్కించుకుని ఆక్రమించేసుకున్నారు.

ఆక్రమణలు ఎంతంటే..

గ్రామం	ఎకరాలు
సోమిరెడ్డిపల్లె	493.33
పలుగురాళ్లపల్లె	88.88
పాపిరెడ్డిపల్లె	180.71
ఇటుకులపాడు	23.3
దిగువ నేలటూరు	1468.29
బి.అగ్రహారం	408.18
డి.నరసింహాపురం	44.53
దిరసవంచ	704.23
ఎగువనేలటూరు	445.96
నాగిశెట్టిపల్లె	325.68
రేకులకుంట	662.94
మొత్తం	4846.03

తండ్రిని, మారుతల్లిని హత్య చేసిన కొడుకు అరెస్ట్ : ఎస్పీ


కేసును ఛేదించిన పోలీసులకు రివార్డు అందజేస్తున్న ఎస్పీ నచికేత్ విశ్వనాథ్

జమ్మలమడుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులో తండ్రిని, మారుతల్లిని హత్యచేసిన కొడుకును అరెస్టు చేశామని ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ వెల్లడించారు. బుధవారం ఆయన జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్ తనిఖీ చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్పీ మాట్లాడుతూ.. ఈనెల 25న మంచంలో పడుకుని ఉన్న కుడేటి నాగప్ప (63), తలారి పాముల పెద్దక్క (54) హత్యకు గురయ్యారన్నారు. 26వ తేదీ కుడేటి పెద్ద వెంకటేశ్ ఫిర్యాదు మేరకు తమ సిబ్బంది దర్యాప్తు వేగవంతం చేశారన్నారు. కుడేటి నాగప్ప, అతనితో కలిసి ఉన్న పాముల పెద్దక్కను హత్య చేసిన నిందితుడు వారి కొడుకు చిన్న వెంకటేశ్‌గా గుర్తించారన్నారు. బుధవారం అతడిని అరెస్టు చేశామన్నారు.

ఆన్‌లైన్‌లో బెట్టింగ్‌ల గేమ్‌లు ఆడటం వలన సుమారు రూ.30 లక్షలు అప్పులు చేసినట్లు విచారణలో నిందితుడు తెలిపాడన్నారు. అప్పులు తీర్చడానికి తండ్రి నాగప్పను పలుమార్లు ఆస్తి పంచాలని గొడవ పెట్టినా ఇవ్వలేదని, తన తండ్రితో సహజీవనం సాగిస్తున్న పాముల పెద్దక్క కూడా ఆస్తి ఇచ్చేందుకు నిరాకరించడంతో వారిద్దరినీ చంపాలని నిర్ణయించుకున్నాడన్నారు. 25వ తేదీ రాత్రి ఇటుకల బట్టీ వద్ద ఇద్దరూ ఒకే మంచంలో పడుకుని ఉండగా అక్కడే ఉన్న ఒక పట్టుడు కట్ట తీసుకుని వారి తలలపై కొట్టి చంపినట్లు అంగీకరించాడని ఎస్పీ తెలిపారు. నిందితుడిని అరెస్టు చేయడంలో ప్రతిభ చూపిన తమ సిబ్బంది సీఐ నరేశ్‌బాబు, ఎస్ఐ రామకృష్ణ, హైమావతి, సిబ్బంది నాగేంద్ర, మహేశ్, క్రిష్టారెడ్డి, గంగాధర్, సుధాకర్, ప్రవీణ్, సురేశ్‌తోపాటు డీఎస్పీ వెంకటేశ్వరరావును ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు. గండికోట బాలిక హత్య కేసుకు సంబంధించి విచారణలో ఉందని, పాలిగ్రాఫ్ టెస్ట్ జరిగిందని, త్వరలో ఆ కేసును కూడా ఛేదిస్తామని తెలిపారు. అనంతరం ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ గండికోటకు వెళ్లారు. జూలై 14వ తేదీ బాలిక హత్య జరిగిన స్థలాన్ని పరిశీలించారు.

పూర్వవైభవం తీసుకువస్తాం

● కూలిన బ్రహ్మంగారి గృహాన్ని పరిశీలించిన కలెక్టర్


పాక్షికంగా కూలిన బ్రహ్మంగారి ఇంటిని పరిశీలిస్తున్న కలెక్టర్ చెరుకూరి శ్రీధర్

బ్రహ్మంగారిమఠం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారి గృహానికి పూర్వవైభవం తీసుకువస్తామని కలెక్టర్ చెరుకూరి శ్రీధర్ అన్నారు. కాలజ్ఞానకర్త పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి పూజామందిరం, నివాస గృహం మంగళవారం అర్ధరాత్రి తుఫాను వల్ల పాక్షికంగా కూలిపోయింది. విషయం తెలుసుకున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి బుధవారం స్వామివారి గృహాన్ని సందర్శించారు. దేవదాయశాఖ అధికారులతో మాట్లాడారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ భూత భవిష్యత్ వర్తమానాన్ని ముందుగానే ప్రజలకు తెలిపిన మహానుభావుడు పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి అన్నారు. దేవదాయశాఖ అధికారులు ఈ నివాస గృహంపై శ్రద్ధ వహించి కాస్త ముందస్తు చర్యలు తీసుకుని ఉండింటే కూలేది కాదన్నారు. నిపుణుల చేత సర్వే చేసి యథావిధిగానే పునర్నిర్మాణం చేయించి ప్రజలకు ఐదు నెలల్లోనే దర్శనభాగ్యం కల్పిస్తామని అన్నారు. ఈ కార్యక్రమంలో బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, ఎంపీడీవో రామచంద్రారెడ్డి, తహశీల్దార్ కార్తీక్, టీడీపీ నేతలు చెన్నుపల్లె సుబ్బారెడ్డి, ఎల్లటూరు సాంబశివారెడ్డి, ముడుమాల పోలిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

బియ్యం దొంగలకు.. రంగుపడుద్ది

● ఏసీబీ తరహాలో బియ్యం తనిఖీలకు ప్రత్యేక కెమికల్

● కెమికల్ వేయగానే.. రంగుమారనున్న ఫోర్టిఫైడ్ బియ్యం
● ఇక నియోజక వర్గాల వారీగా నిఘా

చౌకబియ్యం అక్రమరవాణా కట్టడికి కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టింది. జిల్లాలో కడప, చెన్నూరు, బద్వేలు, ప్రొద్దుటూరుతో పాటు అన్ని పట్టణ కేంద్రాల్లో బియ్యం మాఫియా పెత్తనం చెలాయిస్తోంది. అక్రమార్కుల ఊరు, పేర్లు అధికారులకు తెలిసినప్పటికీ వీరిపై మొక్కుబడిగా 6-ఏ కేసులతో సరిపెడుతున్నారు. టన్నుల కొద్ది బియ్యం పట్టుబడినా, గోడౌన్లలో మాయం అయినా? డీలర్లు చేతివాటం చూపినా? సరే సర్దుబాటుతో సఖ్యతగా ఉంటూ కొందరు అధికారులు ప్రభుత్వ ఆశయానికి తూట్లు పొడుస్తున్నారు. ఇలాంటి వాటికి చెక్‌పెట్టేలా రాష్ట్ర ప్రభుత్వం వినూత్నంగా ఏసీబీ తరహాలో పేదల బియ్యంపై నిఘా పెట్టింది.

కడప కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పేదల ఆహార భద్రత కోసం వందల కోట్ల ఆర్థిక భారం భరిస్తూ కిలో రూ.36తో కొని పేదలకు రూపాయికే ఇస్తున్నాయి. అలాంటి పేదల బియ్యం పక్క రాష్ట్రాలకు వందల టన్నులు అక్రమంగా తరలిపోతోంది. దొరికితే దొంగ లేకపోతే దొర అన్నట్లుగా బియ్యం మాఫియా సాగుతోంది. సాధారణ బియ్యం మాటున పేదల బియ్యాన్ని బ్లాక్ మార్కెట్‌కు అక్రమంగా తరలించడాన్ని అరికట్టేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టింది. వీరిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకునేందుకు నిఘా పెట్టింది. సాధారణ బియ్యమో? సబ్సిడీ బియ్యమో నిగ్గు తేల్చేందుకు కెమికల్ నిర్ధారణకు పూనుకుంది. సబ్సిడీ బియ్యంలో కలిసి ఉండే ఫోర్టిఫైడ్ రైస్‌ను ద్రావకం ద్వారా నిర్ధారించనున్నారు. దీంతో అనుమానం కలిగిన బియ్యంపై కెమికల్ చుక్కలు వేయగానే అందులో ఫోర్టిఫైడ్ రైస్ ఉంటే రంగు మారుతుంది. ఇలాంటి కిట్స్‌ను నియోజకవర్గానికి ఒకటి చొప్పున ఇప్పటికే జిల్లాల వారీగా పంపిణీ చేశారు. మన జిల్లాలో బియ్యం మాఫియా ఆటలు కట్టేలా ఎన్‌ఫోర్సుమెంట్ అధికారులు 9 కిట్లతో దాడులకు సిద్ధమయ్యారు. బియ్యాన్ని పరీక్షలు చేసి నిర్ధారించి అక్కడికక్కడే 6-ఏ కేసులు లేదా క్రిమినల్ కేసులు బనాయించనున్నారు.

గత ప్రభుత్వంలో అంతా రహస్యమే

గత వైసీపీ ప్రభుత్వ హయాంలో విజిలెన్స్ దాడులు, ఎన్‌ఫోర్సుమెంట్ దాడుల్లో వందలాది టన్నుల బియ్యం పట్టుబడినా బయటకు పొక్కనిచ్చేవారు కాదు. మీడియాకు సమాచారం ఇవ్వకుండా మొక్కుబడిగా 6-ఏ కేసులతో మమ అనిపించారనే విమర్శలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నమోదైన 400కు పైగా 6-ఏ కేసులకు నేటికీ అతీగతీ లేదు. ఇంకా హియిరింగ్ దశలోనే ఉన్నాయి. అక్రమార్కులకు కొందరు అధికారులు అండగా నిలవడంతో టన్నుల కొద్దీ బియ్యం తరలించేవారిని జైలుకు పంపిన దాఖలాలు తక్కువ.

బియ్యం ఫోర్టిఫైడ్ ఇలా


ప్రభుత్వం పేదల ఆరోగ్య భద్రతకు ప్రాధాన్యత కల్పిస్తూ పోషకాలతో కూడిన ఫోర్టిఫైడ్ రైస్‌ను కలిపి పంపిణీ చేస్తోంది. ఈ బియ్యంలో పోషకాలు పుష్కలంగా ఉంటాయి. ఫోర్టిఫైడ్ రైస్ అంటే.. బియ్యాన్ని పిండిగా మార్చి అందులో ఐరన్, జింక్, ఫోలిక్ యాసిడ్ బీ-12 వంటి విటమిన్లు కలుపుతారు. మళ్లీ ఆ పిండిని బియ్యం గింజలుగా మార్చి క్వింటా బియ్యానికి కిలో ఫోర్టిఫైడ్ రైస్‌ను కలుపుతారు. ప్రజల ఆహార భద్రతతో పాటు చిన్నప్పటి నుంచే అంటే అంగన్వాడీ పిల్లలు, విద్యార్థులకు మధ్యాహ్న భోజనంతో పాటు పేదలకు పౌష్టికాహార లోపం రాకూడదనే లక్ష్యంతో పేదల బియ్యంలో ఫోర్టిఫైడ్ రైస్ కలిపి సరఫరా చేస్తున్నారు.



బియ్యాన్ని కెమికల్ ద్వారా పరీక్షలు నిర్వహించే కిట్టు

ఇలాంటి బియ్యం అక్రమంగా తరలిపోకుండా ఉండేందుకు కూటమి సర్కారు తెచ్చిన వినూత్న విధానంతో కళ్లెం పడనుంది.

క్రిమినల్ కేసులు నమోదు చేస్తాం



పేదలకు ప్రభుత్వం ఇచ్చే బియ్యాన్ని అక్రంగా సేకరించినా, అమ్మినా? కొన్నా 6-ఏ కేసులతో పాటు క్రిమినల్ కేసులు తప్పవు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కెమికల్ పరీక్షల ద్వారా సబ్సిడీ బియ్యాన్ని సులభంగా గుర్తించవచ్చు. జిల్లాకు ఇప్పటికే 9 కిట్లు వచ్చాయి. అందులో 7 నియోజకవర్గాల పరిధిలోని ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ తహశీల్దార్లకు ఒక్కొక్కటి చొప్పున, సివిల్ సప్లయ్ సహాయ అధికారులకు మరో రెండు కిట్లు అందించాము. ఎక్కడైనా రేషన్ బియ్యం తరలిస్తున్నట్లు ఫిర్యాదులొస్తే వెంటనే చర్యలు తీసుకుంటాం.

- రఘురామ్, జిల్లా పౌరసరఫరాలశాఖ అధికారి

అన్నదాతలపై మొంథా ప్రభావం


కడప రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్ అన్నదాతలపై తీవ్ర ప్రభావం చూపింది. ఈ నెల 26 నుంచి నాలుగు రోజుల పాటు వర్షాలు పడ్డాయి. ఇందులో మంగళవారం ఒక్క రోజునే జిల్లా అంతటా 1824.2 మి.మీ వర్షపాతం నమోదైంది. నాలుగు రోజులుగా ఎడతేరిపి లేకుండా కురిసిన వర్షాలకు వేల ఎకరాలలో పంటలు దెబ్బతిన్నాయి. ఈ మేరకు జిల్లాలోని ఆయా మండల వ్యవసాయాధికారులు పంట నష్టాలపై అంచనా వేశారు. 4,378.23 హెక్టార్లలో పంట నష్టం వాటిల్లినట్లు ప్రాథమిక నివేదికలు జిల్లా వ్యవసాయశాఖకు పంపారు.

పేదవాడి సొంతింటి కల నెరవేరుస్తాం.. ఊర్లకు ఊర్లు కట్టిస్తాం.. అంటూ గత ప్రభుత్వం తమను నట్టేట ముంచిందని పేదలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకటిన్నర సెంటు స్థలంలో, వారిచ్చిన మొత్తంతో పాటు అప్పు చేసి మరీ నిర్మించిన ఇళ్లు పూర్తి కాకపోవడంతో నష్టపోయామని అంటున్నారు. జగనన్న కాలనీల పేరుతో ఏర్పాటు చేసిన లేఅవుట్లు జనావాసాలకు దూరంగా అనువుగాని చోట గుట్టలు కొండల్లో ఉండడంతో అవి నివాసయోగ్యంగా లేవని నిరాశ వ్యక్తం చేస్తున్నారు.

అనువుగాని చోట..

- అధిక శాతం అసంపూర్తి భవనాలే..
- అప్పుల పాలైన లబ్ధిదారులు
- పేదలను ముంచిన జగనన్న ప్రభుత్వం

జగనన్న లేఅవుట్‌లు!


నామాల గుట్టపై కట్టిన ఇళ్లు

రాయచోటి-నేతాజీ సర్కిల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ ప్రభుత్వంలో సంబేపల్లె మండలంలో 17 లేఅవుట్లు వేసి, ఒక్కొక్కరికి 1.5 సెంట్లు చొప్పున పట్టాలిచ్చి 1,484 గృహాలు మంజూరు చేశారు. కాలనీలో గృహాలన్నీ ఒకే కొలతల్లో ఆదర్శంగా ఉండాలి. అయితే కొన్ని చోట్ల పలుకుబడి ఉన్న వాళ్లు ఒక్కొక్కరు రెండు, మూడు ప్లాట్లు ఆక్రమించుకొని పెద్ద పెద్ద గృహాలు కట్టడం ఈ వ్యవహారంలో అక్రమాలు చోటు చేసుకున్నాయడానికి నిదర్శనం. జిల్లా వ్యాప్తంగా అన్ని మండలాల్లో ఇదే పరిస్థితి ఉన్నట్లు సమాచారం. జగనన్న లేఅవుట్లకు కేటాయించిన స్థలాల్లో జంగిల్ క్లియరెన్స్ పేరుతో పలువురు నాయకులు తొలి దశలోనే సొమ్ము చేసుకున్నారు. ఇసుక, సిమెంటు, కడ్డీలు గృహ అవసరాలకు ఉపయోగపడే సామగ్రి ధరలు అధికంగా ఉండడంతో ప్రభుత్వం ఇచ్చే రూ.1.80 లక్షలు సరిపోక అప్పులు చేసి కొంత మంది గృహాలు కట్టారు. కొంత మంది పునాది దశలోనే వదిలేశారు. మరికొంత మంది గోడలు పూర్తి చేసి, మరికొంత మంది మౌల్డింగ్ వేసి వదిలేశారు.

మన ఇళ్లు, మన గౌరవం..

గత వైసీపీ ప్రభుత్వంలో గృహాలు మంజూరైనా ఆర్థిక పరిస్థితులు సక్రమంగా లేక వివిధ దశల్లో ఆగిపోయిన ఇళ్ల నిర్మాణాలను కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 డిసెంబరు 31వ తేదీ నాటికి పూర్తి చేసే లక్ష్యంతో 'మన ఇళ్లు మన గౌరవం' పేరుతో లబ్ధిదారులకు రుణాలను అందించేలా డ్వాక్రా తరఫున ప్రోత్సాహం అందించింది. అయితే ఇప్పటికీ. 40 శాతం నిర్మాణాలు పూర్తి కాగా, . ఇంకా 60 శాతం వివిధ దశల్లో ఉన్నాయి. సంబేపల్లె మండలంలోని మోటకట్ల పంచాయతీలోని వడ్లపల్లి మార్గంలో 183 గృహాలకు లేఅవుట్‌లు వేసి, 120 మందికి గృహాల మంజూరు పత్రాలను అందించారు. అయితే, ఈ కాలనీలో పలువురు అనర్హులు పునాదులు వేసి వదిలేశారు. గృహాల పేరుతో వ్యాపారం చేసేందుకు కొంత మంది ఈ మార్గాన్ని ఎంచుకోవడంతో ఇప్పటికీ ఇక్కడ పునాదులే కనిపిస్తున్నాయి. సంబేపల్లె పంచాయతీ నామాల గుట్టపైన 40 గృహాలు మంజూరు చేసినా, ఆ ఇళ్లు ఇక్కడ నివాస యోగ్యంగా లేవు. దుద్యాల, దేవపట్ల, నారాయణరెడ్డిపల్లె, ఇలా చాలా గ్రామ పంచాయతీల్లో ఇదే పరిస్థితి.


బండపై పునాది కోసం రాళ్లు తోలి వదిలేసిన దృశ్యం


గోడల స్థాయిలోనే నిలిచిపోయిన పనులు

భవనాలకు ఆర్థిక భరోసా



పూర్తికాని ఇండ్ల కోసం కూటమి ప్రభుత్వం ఆర్థిక భరోసాను కల్పించింది. బీసీ, ఎస్సీ, మైనా ర్టీ లబ్ధిదారులకు 50 వేలు, ఎస్టీ లబ్ధిదారులకు 75 వేల రూపాయలు చొప్పున సాయం అందించింది. మన ఇళ్లు, మన గౌరవం పేరుతో డిసెంబర్ నాటికి పూర్తి చేయాలని ప్రభుత్వం ప్రోత్సహిస్తున్నా ఆర్థికంగా ఇబ్బందుల కారణంగా లబ్ధిదారులు ముందుకు రావడం లేదు.

- కూనాసి సుబ్బరాజుయాదవ్, పీఏసీఎస్ డైరెక్టర్

కడప-బెంగుళూరు రైల్వే లైన్‌పై నిర్లక్ష్యం ఎందుకు?

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప-బెంగుళూరు బ్రాడ్ గేజ్ రైల్వే నిర్మాణంపై నిర్లక్ష్యం ఎందుకని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును కాంగ్రెస్ పార్టీ ముఖ్య అధికార ప్రతినిధి తులసిరెడ్డి ప్రశ్నించారు. రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న రైల్వే ప్రాజెక్టులపై అధికారులతో జరిగిన సమీక్షలో కడప-బెంగుళూరు రైల్వే నిర్మాణంపై చర్చించక పోవడం శోచనీయమని బుధవారం విడుదల చేసిన ప్రకటనలో విమర్శించారు. 2008లో కాంగ్రెస్ ప్రభుత్వం రూ.3038 కోట్ల అంచనాతో 25 కిలోమీటర్ల పొడవున రైల్వేలైన్ వేసేలా కేంద్రం 50శాతం, రాష్ట్రం 50శాతం భరించేలా పనులు ప్రారంభమయ్యాయన్నారు. కడప నుంచి పెండ్లిమర్రి వరకు 22 కిలోమీటర్ల మేర పనులు పూర్తయ్యాయని, రూ.350కోట్లు ఖర్చు చేయగా, రూ.133కోట్లు రాష్ట్రం భరించిందన్నారు. ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడం దురదృష్టకరమన్నారు. ఇప్పటికైనా రైల్వేలైన్‌పై దృష్టిసారించి నిధులు కేటాయించాలని సూచించారు.

మద్యం మత్తులో కింద పడి వ్యక్తి మృతి


వెంకటనారాయణ మృతదేహం

రామాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో కింద పడి ఓ వ్యక్తి మృతి చెందినట్లు ఎస్ఐ వెంకట సుధాకర్‌రెడ్డి తెలిపారు. వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని రాచపల్లి పంచాయతీ ఎగువ ఉప్పరపల్లికి చెందిన టేకూరి వెంకట నారాయణ(67) మదన పల్లిలో మగ్గం నేస్తుంటాడు.ఈ నెల 25వ తేదీన స్వగ్రామంలోని ఇంటికి వచ్చాడు. మంగళవారం రాత్రి మద్యం మత్తులో మండల కేంద్రం సమీపంలో కిందపడడంతో తలకు, కాళ్లకు గాయాలై అక్కడే పడిపోయాడు. బుధవారం ఉదయం అతనిని గమనించిన స్థానికులు అప్పటికే అతను మృతి చెందినట్లు గుర్తించారు. రామాపురం పోలీసులు మృతదేహాన్ని లక్కిరెడ్డిపల్లె ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

క్రెడిట్ కార్డు అప్‌గ్రేడ్ పేరుతో మోసం

పీలేరు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): క్రెడిట్ కార్డు లిమిట్ పెంపు పేరుతో సైబర్ నేరగాళ్లు ఆ కార్డులోని రూ.1.61 లక్షలు కాజేసిన సంఘటన బుధవారం పీలేరులో వెలుగు చూసింది. పీలేరు పట్టణం నాగిరెడ్డి కాలనీకి చెందిన సాయి సత్యం వీఎస్ఎన్ సాయి సార్‌గా స్థానికంగా చిరపరిచితుడు. అనారోగ్యం కారణంగా కొంత కాలంగా ఆయన ఇంటి వద్దనే ఉంటున్నాడు. మంగళవారం ఉదయం క్రెడిట్ కార్డు లిమిట్ పెంచుతామంటూ ఆయన ఫోనుకు గుర్తు తెలియని వ్యక్తి ఫోన్ చేశాడు. తమకు ఎటువంటి పెంపు వద్దని ఆయన ఫోన్ పెట్టేసినా.. వెంటనే కొన్ని ఓటీపీలు వచ్చాయి. వాటిని చూసుకుంటూ ఉండగానే క్రెడిట్ కార్డు నుంచి రూ.1,61,00లు కట్ అయినట్లు మెసేజ్‌లు వచ్చాయి. తాము ఎటువంటి లావాదేవీలు చేయకపోయినా క్రెడిట్ కార్డులో నుంచి డబ్బు విత్‌డ్రా కావడంతో.. ఆ విషయాన్ని బ్యాంకు సిబ్బందికి తెలియజేశారు. బ్యాంకు సిబ్బంది సూచన మేరకు బుధవారం పీలేరు పోలీసులు, రాయచోటిలోని సైబర్ విభాగానికి ఫిర్యాదు చేశారు.

ఉరి వేసుకుని యువకుడు మృతి

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): క్షణికావేశంలో ఉరి వేసుకుని ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు... మండలంలోని బూర్లపల్లెకు చెందిన పల్లపు వెంకట్రమణ, రవణమ్మ దంపతుల కుమారుడు సతీశ్‌కుమార్ (22) మంగళవారం రాత్రి బూర్లపల్లెలోని నివాసం ఉంటున్న ఇంట్లో ఉరి వేసుకుని మృతి చెందాడు. మృతికి గల కారణాలు తెలియరాలేదు. కాగా, మృతుడి సోదరుడు సైతం ఐదేళ్ల క్రితం ఉరి వేసుకునే మృతి చెందాడు. ఇద్దరు కొడుకులు మృతి చెందడంతో తల్లితండ్రులు కన్నీరు మున్నీరుగా విలపించారు. యువకుడి ఆత్మహత్యపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

టైరు పగిలి వాహనం బోల్తా ..


బోల్తాపడ్డ బొలేరో వాహనం

చిన్నమండెం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని జాతీయ రహదారిపై దేవపట్ల క్రాస్ రోడ్డు వద్ద బుధవారం తెల్లవారు జామున 3 గంటల సమ యంలో వెనుక టైర్లు పేలి పోవడంతో బొలేరో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ సమయంలో అటుగా ఏ వాహ నం రాక పోవడంతో ప్రమాదం తప్పింది. మదనపల్లి వైపు నుంచి కడప వైపునకు నారు తీసుకు వెళుతుండగా ఈ ప్రమాదం జరిగినట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ప్రమాదంలో డ్రైవర్‌తో పాటు ఎవరికీ గాయాలు కాలేదని తెలిపారు.

కలికిరి పెద్ద చెరువుకు 'ఇసుక పరీక్ష'


కలికిరి పెద్దచెరువు కట్టమీద నెర్రెలుపడ్డ చోటు

కలికిరి, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కలికిరి పెద్ద చెరువు కట్ట నెర్రెలు చీలి కుంగడంతో కారణాలు నిర్ధారించడానికి జలవనరుల శాఖ ఇంజనీర్లు కసరత్తు చేస్తున్నారు. చెరువు కట్ట కుంగి ప్రమాదంలో ఉందన్న ఆంధ్రజ్యోతి కథనానికి స్పందించిన ఆ శాఖ ఇంజనీర్ల బృందం సోమవారం కట్టను పరిశీలించి వెంటనే మరమ్మతులు చేయాలని నిర్ధారణకు వచ్చారు. ఈ ప్రతిపాదనలపై నిపుణుల అభిప్రాయం కోరగా, కట్ట మీద పడిన నెర్రెలు కట్టకు సంబంధించినవా.. లేక ఆర్అండ్‌బీ రోడ్డుకు సంబంధించినవా అన్న విషయంపై నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. దీంతో మంగళవారం జలవనరుల శాఖ ఇంజనీరు శ్రీనివాసులు రెడ్డి నెర్రెలు పడ్డ ప్రాంతంలో ఇసుక నింపారు. ఈ ఇసుక లోపలికి వెళుతుందా లేదా అన్న విషయాన్ని గమనించి తదుపరి కార్యాచరణ చేపట్టాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఈ లోగా రహదార్ల శాఖ ఇంజనీర్లకు కూడా సమాచారం అందజేసి కట్ట మీద వేసిన తారు రోడ్డును పరిశీలించాలని కోరినట్లు శ్రీనివాసులు రెడ్డి చెప్పారు.

గంజాయి తరలిస్తున్న ముగ్గురు యువకుల అరెస్ట్


గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ యువకులను చూపుతున్న పోలీసులు


మదనపల్లి: గంజాయి విక్రేతలను చూపుతున్న సీఐ మహమ్మద్ రఫీ

పెద్దతిప్పసముద్రం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఓ ద్విచక్ర వాహనంలో గంజాయిని తరలిస్తున్న ముగ్గురు యువకులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఎస్ఐ హరిహరప్రసాద్ తెలిపిన వివరాల మేరకు.. మండలంలోని బి.కొత్తకోట రోడ్డులో ఉన్న ఓ పెట్రోల్ బంకు వద్ద బుధవారం పోలీసులు వాహన తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో ఓ ద్విచక్ర వాహనంపై ముగ్గురు యువకులు వెళుతుండడం గమనించి, వారిని తనిఖీ చేయగా గంజాయి లభించినట్లు తెలిపారు. దీంతో బైక్‌పై ప్రయాణిస్తున్న మదనపల్లెకు చెందిన ఫారూక్(29), ఓ బాలుడు, ముదివేడుకు చెందిన హరీష్(19) ఉన్నట్లు తెలిపారు. ద్విచక్రవాహనం స్వాధీనం చేసుకుని ముగ్గురిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

గంజాయి విక్రేతల అరెస్టు

మదనపల్లె అర్బన్ :గంజాయి విక్రయం కేసులో ఇద్దరిని అరెస్టు చేసినట్లు మదనపల్లె వన్‌టౌన్ సీఐ మహమ్మద్ రఫీ తెలిపారు. బుధవారం స్థానిక వన్‌టౌన్ పోలీసుస్టేషన్‌లో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో నిందితుల వివరాలను వెల్లడించారు. కురబలకోట మండలం, కసాయివీధికి చెందిన నజీర్ కుమారుడు కంపమల్లి మహమ్మద్ అనీఫ్ (22), మదనపల్లె పట్టణం చంద్రా కాలనీకి చెందిన దండు విజయ్‌కుమార్ (21) మంగళవారం సాయంత్రం బైక్‌పై గంజాయిని తీసుకుని బెంగళూరు రోడ్డు, బీటీ కళాశాల మైదానంలో అమ్మడానికి వెళుతుండగా అదుపులోకి తీసున్నామన్నారు. వారి నుంచి 2 కేజీల గంజాయి, రెండు మొబైల్ ఫోన్లు స్వాధీనం చేసుకున్నామన్నారు. వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించామన్నారు. వీరికి గంజాయి సరఫరా చేస్తున్న మదనపల్లెకు చెందిన సయ్యద్ ఖాసీంసాబ్ కుమారుడు జాఫర్ అలీ, చలపతి కుమారుడు శివకుమార్ పరారీలో ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ అన్సర్‌బాషా, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

చిట్‌ఫండ్ సభ్యులపై యాజమాన్యం దాడి

- కార్యాలయానికి తాళం వేసిన బాధితులు
- ఇరువర్గాలపై కేసులు నమోదు

మదనపల్లె అర్బన్, మే 29 (ఆంధ్రజ్యోతి): చిట్టీ పూర్తయినా నగదు చెల్లించకపోవడంతో సభ్యులు బుధవారం స్థానికా ఆర్టీసీ బస్టాండు సమీపంలో ఉన్న కపిలేశ్వర చిట్‌ఫండ్ కార్యాలయానికి తాళాలు వేశారు. దీంతో చిట్‌ఫండ్ కంపెనీ యాజమాన్యం వారిపై దాడి చేసింది. ఇరువర్గాల ఫిర్యాదు మేరకు కేసులు నమోదు చేసినట్లు టూటౌన్ సీఐ రామచంద్ర తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. పట్టణానికి చెందిన రామమోహన్‌రెడ్డి, అతని భార్య రత్నమ్మ స్థానిక కపిలేశ్వర చిట్‌ఫండ్ కంపెనీలో 2020 సెప్టెంబరులో చెరో ఐదు లక్షలకు చిట్ వేశారు. కంతులు పూర్తయినా అందుకు సంబంధించిన మొత్తాన్ని చెల్లించకపోగా, పలుమార్లు అడిగినా యజమాని సీకే నాయుడు, మేనేజరు నరసింహులు స్పందించకపోవడంతో బుధవారం ఆ సంస్థ కార్యాలయానికి తాళాలు వేశారు. విషయం తెలుసుకున్న యజమాని ప్రొద్దుటూరు నుంచి మనుషులను రప్పించి తాళాలు పగులగొట్టారు. డబ్బు ఇస్తామని చెప్పి బాధితులను పిలిపించి దాడి చేసి గాయపరిచారు. ఇరు వర్గాలు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో చిట్‌ఫండ్ యాజమాని సీకే నాయుడు, మదనపల్లె కార్యాలయ మేనేజరు నరసింహులతోపాటు మరో పదిమంది పైన, బాధితులు రామమోహన్‌రెడ్డి, రత్నమ్మ తోపాటు మరో కొంతమందిపై కేసును నమోదు చేసినట్లు వివరించారు.

అక్రమంగా కుక్కలు పడుతున్నారని పోలీసులకు ఫిర్యాదు

మదనపల్లె అర్బన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అక్రమంగా కుక్కలను పట్టి అడవికి తరలిస్తున్నారంటూ బసినికొండ గ్రామస్థులతో కలిసి సర్వోహం వెల్ షేడ్ ట్రస్టు నిర్వాహకుడు కె బి హరీష్ బుధవారం తాలూకా పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఏబీసీ చట్టాన్ని ఉల్లంఘిస్తూ మంగళవారం రాత్రి నుంచి మున్సిపల్ అధికారులు కుక్కలను పడుతున్నారని, ఇప్పటికే 70 కుక్కలను పట్టి వాహనంలో అడవికి తరలించినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. బసినికొండ సమీపంలో కుక్కలను తరలిస్తున్న టెంపోను అడ్డుకుని మదనపల్లె తాలూకా పోలీసు స్టేషన్‌కు తరలించారు. ఈ విషయంపై మున్సిపల్ కమిషనర్ ప్రమీల స్పందించలేదని, కుక్కలను తరలించినవారిపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అనూరాధ, విజయలక్ష్మి, హరీశ్, అచ్యుత, జయశ్రీ, రవిరాం, కుసుమా, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి తీవ్ర గాయాలు


తీవ్రంగా గాయపడ్డ సాధిక్

ములకలచెరువు, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): రోడ్డు ప్రమాదంలో ఓ యువ కుడు తీవ్రంగా గాయపడినట్లు పోలీసులు తెలిపారు. కాలు వపల్లెకు చెందిన ఖాదర్‌వలి కుమారుడు సాధిక్(20) బుధవారం ద్విచక్ర వాహనంలో ములకలచెరువుకు వెళుతుండగా చౌడసముద్రం వద్ద రోడ్డుపై ఏర్పడిన గుంతలో పడడంతో వాహనం అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన యువకుడిన చికిత్స నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు.

ఆక్రమణలను తొలగించండి

మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆక్రమణలను తొలగించాలని బహుజన యువసేన అధ్యక్షుడు పునీత్‌కుమార్ బుధవారం సబ్ కలెక్టర్ కల్యాణికి విన్నవించారు.అనంతరం మాట్లాడుతూ పట్టణంలోని బాహుదానది, కురవంక స్థలాలను చాలా మంది ఆక్రమించారన్నారు. ఈ ఆక్రమణలన్నింటినీ తొలగించాలన్నారు. ఆక్రమిత స్థలాల్లో నిర్మాణాలకు అప్రూవల్స్ ఇవ్వకుండా చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిలానిబాషా, హరికృష్ణ, శశికుమార్, కిరణ్ పాల్గొన్నారు.

చెరువులకు జలకళ

మదనపల్లె టౌన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జలవనరుల శాఖ మదనపల్లె డివిజన్‌లో 357 చెరువులు నిండాయని ఈఈ సురేష్‌బాబు ప్రకటించారు. బుధవారం ఆయన మాట్లాడుతూ మదనపల్లె డివిజన్‌లోని 16 మండలాల్లో 1,959 చెరువులు ఉన్నాయన్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు పెద్దేరు, బాహుదా ప్రాజెక్టులు నిండి మొరవలు పోతున్నాయని, 357 చిన్న, పెద్ద చెరువులు నిండిపోయాయన్నారు. వీటితో పాటు 362 చెరువులు 75 శాతం నీటితో నిండాయని, 434 చెరువులు 50శాతం నిండాయన్నారు. 302 చెరువులు పాతిక శాతం మాత్రమే నిండాయన్నారు. పెద్దేరు, బాహుదా ప్రాజెక్టు వద్ద తమశాఖ అధికారులు అప్రమత్తంగా ఉన్నారని, నిండిన చెరువుల కట్టల పరిస్థితిని రోజూ జలవనరులశాఖ అధికారులు పర్యవేక్షిస్తున్నారన్నారు. ఎక్కడైనా చెరువు కట్టలు ప్రమాదకర స్థితిలో సమాచారం ఇవ్వాలని ఈఈ కోరారు.

డ్రోన్ల సాయంతో మందులు పిచికారీ చేయాలి

- కృషి విజ్ఞాన్ కేంద్రం సమన్వయకర్త అంకయ్య కుమార్


వరి పైరును పరిశీలిస్తున్న శాస్త్రవేత్తలు

ఒంటిమిట్ట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : భూమిలో తేమ ఎక్కువగా ఉన్నందున డ్రోన్ ద్వారా మందులు పిచికారీ చేసి పంటను పాడుకోవాలని, కృషి విజ్ఞాన కేంద్రం ఊటుకూరు సమన్వయకర్త డాక్టర్ అంకయ్యకుమార్ సూచించారు. బుధవారం మండలంలోని నర్సన్నగారిపల్లె, గంగపేరూరు గ్రామాల్లో సాగుచేసిన వరిపైరును పరిశీలించారు. వర్షం కారణంగా వరికంకుల నుంచి గింజలు మొలకెత్తాయన్నారు. పడిపోయిన కంకుల్లోని గింజలు కూడా మొలకెత్తాయన్నారు. దీని నివారణకు ఒక లీటరు నీటికి 50 గ్రాముల చొప్పున ఉప్పును కలిపి పిచికారీ చేయాలన్నారు. నల్లగింజ, పొట్ట కుళ్లు, మానిపండు తెగుళ్లు, దోమ పోటు నివారణకు మందులు వాడాలన్నారు. పసుపులో దుంపకుళ్లు, ఆకుమచ్చ ఇనుప దాతువు లోప నివారణకు మందులు వాడాలన్నారు. ఈ కార్యక్రమంలో శాస్త్రవేత్తలు సునీల్‌కుమార్, మాధురి, యాస్మిన్, కృష్ణప్రియ, మండల వ్యవసాయాధికారి మంజుల రాణి, రైతులు పాల్గొన్నారు.

పదో తరగతి పరీక్ష కేంద్రాల పరిశీలన


మోడల్ స్కూల్‌లో డెస్కలను పరిశీలిస్తున్న కొండూరు శ్రీనివాసకుమార్‌రాజు

లక్కిరెడ్డిపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రానున్న పదో తరగతి పరీక్ష కేంద్రాలను అసిస్టెంట్ కమిషనర్ ఫర్ గవర్నమెంట్ ఆఫీసర్ కొండూరు శ్రీనివాసరాజు పరిశీలించారు. విద్యా కమిషనర్ విజయరామరాజు ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పరీక్ష కేంద్రాలను పరిశీలిస్తున్నట్లు ఆయన తెలిపారు. 2026 మార్చిలో జరగబోవు 10వ తరగతి పబ్లిక్ పరీక్షా కేంద్రాలకు అన్నమయ్య జిల్లా లో 121 సెంటర్లు ఏర్పాటు చేశామని, అందులో కొన్ని సెంటర్లలో విద్యార్థులకు వసతులు, డెస్కులు, విద్యుత్, ఫ్యాన్లు, తాగునీటి సౌకర్యం తదితర అంశాలపై ఆరా తీస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్, సూపరింటెండెంట్ రవికుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు నాగిరెడ్డిపల్లె విద్యార్థి


అశోక్‌ను అభినందిస్తున్న ఉపాధ్యాయులు

నందలూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగిరెడ్డిపల్లె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థి కోమటిగుంట అశోక్ ఇటీవల జరిగిన అండర్-14 బాలుర వాలీబాల్ పోటీల్లో విజయం సాధించి రాష్ట్ర స్థాయికి ఎంపికయ్యాడు. బుధవారం ఆ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గంగనపల్లి వెంకటరమణ, వ్యాయామ ఉపాధ్యాయురాలు గౌరి తదితరు లు అశోక్‌ను అభినందిస్తూ జ్ఞాపిక, పుస్తకం బహూకరించారు. రాష్ట్ర స్థాయిలో కూడా ఉత్తమ ప్రతిభ కనబరచి పాఠశాలకు గుర్తింపును తీసుకురావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జీవశాస్త్ర ఉపాధ్యా యుడు రాజేంద్ర పాల్గొన్నారు.

ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్లకు శిక్షణ


శిక్షణ ఇస్తున్న శివకుమార్

బి.కొత్తకోట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అటవీశాఖ సెక్షన్ ఆఫీసర్లు, బీట్ ఆఫీసర్లకు బి.కొత్తకోట మండలంలోని హార్సిలీహిల్స్‌లో బుధవారం ఒక రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. రాజమండ్రి ప్రాంతానికి చెందిన 20 మంది ఫారెస్ట్ సెక్షన్ ఆఫీసర్లు, 40 మంది బీట్ ఆఫీసర్లు శిక్షణ తరగతులలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ఎదురయ్యే సమస్యలపై వారికి అవగాహన కల్పించారు. స్థానిక సెక్షన్ ఆఫీసర్ శివకుమార్ హార్సిలీహిల్స్ చరిత్రను వారికి వివరించారు. కార్యక్రమంలో అటవీశాఖ అధికారులు శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌రావు తదితరులు పాల్గొన్నారు.

'పారిశుధ్య సమస్యలు రాకుండా చూడాలి'


వాల్మీకిపురంలో పంచాయతీ సిబ్బందికి సూచనలిస్తున్న డీఎల్‌పీఓ నాగరాజు

వాల్మీకిపురం, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీల్లో పారిశుధ్యం, తాగునీటి సమస్యలు తలెత్తకుండా చూడాలని డీఎల్‌పీఓ నాగరాజు సూచించారు. బుధవారం ఆయన స్థానిక పంచాయతీ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. రికార్డులు పరిశీలించి సిబ్బంది విధుల వివరాలను ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ తుఫాను వర్షం కారణంగా పట్టణంలో సమస్య లను ఎప్పటికప్పుడు పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని, తాగునీటి ఇబ్బందులను కూడా గుర్తిస్తూ ప్రజల నుంచి ఎలాంటి ఫిర్యాదులు రాకుండా చూడాలన్నారు. పంచాయతీ పరిధిలో వందశాతం బకాయిల వసూళ్లు పూర్తిగా ఆన్‌లైన్ ద్వారా చేసేలా వేగవంతం చేయాలన్నారు. అనంతరం స్థానికంగా పలు ప్రాంతాల్లో డ్రైనేజీలు తదితర వాటిని పరిశీలించారు. కార్యక్రమంలో ఈఓ రవీంద్రనాథ్, సిబ్బంది పాల్గొన్నారు.

టీడీపీ ఎన్ఆర్ఐ ఆస్ట్రేలియా కోఆర్డినేటర్‌గా విలియంబాబు



మదనపల్లె టౌన్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆస్ట్రేలియా టీడీపీ ఎన్ఆర్ఐ ఐటీ కోఆర్డినేటర్‌గా మదనపల్లెకు చెందిన బోనాసి విలియం బాబు ఎన్నికయ్యారు. మంగళవారం ఆస్ట్రేలియా దేశంలోని మెల్‌బోర్న్‌లో నిర్వహించిన ఎన్ఆర్ఐ టీడీపీ నూతన కమిటీ ఎన్నికలో అధ్యక్షురాలిగా పాలడుగు వినీల ఎన్నికవగా, విలియంబాబు ఐటీ, మీడియా కోఆర్డినేటర్‌గా ఎన్నికయ్యారు.

ఈ సందర్భంగా మదనపల్లెలో టీడీపీ క్రిస్టియన్ మైనార్టీ టీడీపీ నేత బోనాసి జాన్‌బాబు మాట్లాడుతూ తమ కుమారుడు టీడీపీ ప్రతినిధిగా ఆస్ట్రేలియాలో తెలుగు వారికి సేవలందించేందుకు ఎన్నికవడం ఆనందంగా ఉందన్నారు. ఆస్ట్రేలియాలో పర్యటించిన మంత్రి నారా లోకేశ్ ప్రోత్సాహంతో విలియం బాబు మరిన్ని కార్యక్రమాలు చేసేందుకు ముందుకు వెళుతున్నారన్నారు. విలియంబాబుకు మదనపల్లె క్రిస్టియన్ నేతలు అభినందనలు తెలిపారు.

డ్రిప్ గగనమే...

ప్రభుత్వం సబ్సిడీతో అందించే డ్రిప్‌ను పొందాలంటే రైతులకు అధికారులు చుక్కలు చూపిస్తున్నారు. నిబంధనల పేరుతో ముప్పుతిప్పలు పెడుతున్నారు. ఒకరైతు పొలంలో పంట సాగుకు డ్రిప్ అవసరమని దరఖాస్తు చేసుకుంటే అదే పొలంలోనే డ్రిప్ ఏర్పాటు చేయాలని అధికారులు పట్టుబడుతున్నారు. అదైనా రైతుకు అవసరమైన మేర పరికరాలు ఇస్తున్నారా అంటే దానికి నిబంధనల పేరుతో కోత విధిస్తున్నారు.

- నిబంధనల పేరుతో...
- రైతులకు చుక్కలు చూపిస్తున్న అధికారులు
- ఏ పొలంలో పంట సాగో.. అక్కడే డ్రిప్
- డ్రిప్పుకోసం తగ్గిన దరఖాస్తులు

పులివెందుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పులివెందుల నియోజక వర్గంలో ఉద్యానపంటల సాగుకు రోజురోజుకు పెరుగుతోంది. ముఖ్యంగా పులివెందుల, లింగాల, వేముల, వేంపల్లె, తొండూరు, సింహాద్రిపురం మండలాల్లో అరటి, చీనీ తదితర ఉద్యాన పంటలు విరివిగా సాగు చేస్తున్నారు. అలాగే రైతులు ఏ పంట అయినా సరే డ్రిప్ పద్ధతిలోనే సాగుకు ఉపక్రమిస్తున్నారు. ప్రస్తుతం బోరుబావుల కింద ఉల్లి, మిరప, టమోట ఇలా ఏ పంటలు అయినా డ్రిప్ పద్ధతిలోనే సాగుచేస్తున్నారు. దీంతో జిల్లాలో అన్ని ప్రాంతాల కన్నా ఎక్కువ పులివెందుల ప్రాంతంలో రైతులు ఎక్కువగా డ్రిప్‌పైనే ఆధారపడుతున్నారు.



ఏ పొలానికి దరఖాస్తు చేసుకుంటే...

నిబంధనలు తప్పనిసరి

కానీ గత ఏడాది కాలంగా అధికారులు నిబంధనలు కఠినతరం చేయడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. గతంలో ఒక రైతు ఐదు ఎకరాల్లో ఒక పంట సాగుకు అవసరమైన డ్రిప్‌కు దరఖాస్తు చేసుకుంటే ఆ రైతు ఆ డ్రిప్ పరికరాన్ని వినియోగించుకుంటున్నారా లేక బహిరంగ మార్కెట్‌లో అమ్మేస్తున్నారా అనే దానిపై ఎక్కువగా అధికారులు దృష్టిసారించేవారు. అంటే ఒక రైతుకు ఐదు ఎకరాలకు అవసరమైన డ్రిప్ పరికరాలు అవసరమైతే ప్రభుత్వం రైతు కావాల్సినంత మేర పరికరాలు అందివ్వదు. కానీ రైతులు ఆ ఐదు ఎకరాలతో పాటు మరో రైతు వద్ద నుంచి పాస్‌పుస్తకం తెచ్చుకొని దానిపైన మరో దరఖాస్తు చేసుకొని రైతుకు అవసరమైన పరికరాలు పొందేవారు. కానీ ప్రస్తుతం అలాంటి పద్ధతి కుదరదని అధికారులు తెగేసిచెబుతున్నారు.

ఏ పొలానికి దరఖాస్తు చేసుకుంటే...

రైతు ఏ పొలంలో ఏ పంట సాగుచేస్తున్నారో ఆ పొలానికి సంబంధించిన సర్వే నెంబర్లతో డ్రిప్‌కు దరఖాస్తు చేసుకోవాలి. వేరొక సర్వే నెంబర్‌తో దరఖాస్తు చేసుకొని మరొక సర్వే నెంబర్‌లో డ్రిప్ అమర్చుతామంటే అందుకు అధికారులు ఒప్పుకోవడం లేదు. ఒక రైతు పత్తిపంట సాగుకు డ్రిప్ పరికరాలు అవసరమై దరఖాస్తు చేసుకుంటే ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఇచ్చే పరికరాలు ఐదు ఎకరాలకు సరిపడవు. మిగిలిన డ్రిప్ పరికరాలను బహిరంగ మార్కెట్‌లో రైతు కొనాల్సి ఉంటుంది. గతంలో మరొక రైతుకు సంబంధించిన పాస్‌పుస్తకం ద్వారా రైతుకు అవసరమైన పరికరాలను పొందేవారు. కానీ ప్రస్తుతం వాటిని పక్కనపెడితే ఏ పొలంలో పంట సాగుచేస్తున్నారో ఆ పొలానికి మాత్రమే డ్రిప్ మంజూరు చేస్తామని అధికారులు అంటున్నారు. ఇది చాలా ఇబ్బందిగా ఉందని రైతులు వాపోతున్నారు.

నిబంధనలు సడలించాలి

ప్రస్తుతం బహిరంగ మార్కెట్‌లో డ్రిప్ పరికరాల ధరలు ఆకాశా న్నంటుతున్నాయి. గతంలో కొందరు డ్రిప్ కంపెనీల డీలర్లు బినామీ రైతులతో చేతులు కలిపి డ్రిప్ పరికరాలను బహిరంగ మార్కెట్‌కు తరలించి సొమ్ము చేసుకున్న ఉదంతాలు లేకపోలేదు. ఈ కారణంగా పంటలు సాగుచేసే నిజమైన రైతులకు తీవ్ర అన్యాయం జరుగుతోంది. ఒక రైతుకు పలు సర్వేనెంబర్లపైన పది ఎకరాలు పొలం ఉంటే ఏడు ఎకరాల్లో డ్రిప్ కోసం దరఖాస్తు చేసుకుంటే అది ఆ రైతు వినియోగించుకున్నారా లేదా అనేది చూడాలి. కానీ ఏ సర్వేనెంబర్‌లో దరఖాస్తు చేసుకుంటే అక్కడే ఏర్పాటు చేయాలనే నిబంధన సడలించాలని రైతులు కోరుతున్నారు.

గండికోట నుంచి మైలవరానికి 2వేల క్యూసెక్కులు విడుదల



గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరానికి నీరు విడుదలవుతున్న దృశ్యం

కొండాపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గండికోట ప్రాజెక్టు నుంచి మైలవరం జలాశయానికి మంగళవారం 2వేల క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నట్లు ఈఈ ఉమామహేశ్వర్లు తెలిపారు. అదేవిధంగా ప్రాజెక్టులోకి జీఎన్ఎస్ఎస్ కాలువ ద్వారా 1800 క్యూసెక్కులు, చాగల్లు రిజర్వాయర్ నుంచి పెన్నానది ద్వారా 400 క్యూసెక్కులు, వరద నీరు మరో 300 క్యూసె క్కులు వచ్చి చేరుతున్నట్లు ఈఈ తెలిపారు. కాగా తాగునీటి అవసరాల దృష్ట్యా మరో 20 క్యూసెక్కుల నీరు వదులుతున్నామన్నారు. గండికోట ప్రాజె క్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 26.85 టీఎంసీలు. కాగా ప్రస్తుతం గండికోట ప్రాజెక్టులో 26.285 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు ఈఈ తెలిపారు.

పెన్నాకు కొనసాగుతున్న నీటి విడుదల

మైలవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మైలవరం జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదల కొనసాగుతుందని జలాశయ ఈఈ రమేష్ బుధవారం తెలిపారు. గండికోట జలాశయం నుంచి 2000 క్యూసెక్కుల నీరు వచ్చి మైలవరంలో చేరుతుండగా మైలవరం నుంచి పెన్నానదికి 4,300 క్యూసెక్కుల నీటిని వదలుతున్నామన్నారు. మైలవరం జలాశయం పూర్తి నీటి మట్టం 6.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 6.1 టీఎంసీల నీరు నిలువ ఉందన్నారు. పై నుంచి ఇన్‌ఫ్లో పెరిగితే పెన్నానదికి మరింత నీటిని విడుదల చేసే అవకాశం ఉన్నందున పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఆయన తెలిపారు.

వరద నీటి ఉధృతికి దారి మూసివేత



పెన్నానది గుండా వెళ్లే వేపరాల, మైలవరం దారి మూసివేత

జమ్మలమడుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మున్సిపాలిటీపరిధిలోని మిఠాయిగిరి వీధి ఉర్దూ పాఠశాల సమీపం నుంచి పెన్నానది గుండా వేపరాల, మైలవరం వెళ్లే దారిని బుధవారం ఉదయాన్నే కమిషనర్ వెంకటరామిరెడ్డి ఆదేశాల మేరకు స్థానిక సచివాలయ సిబ్బంది మూసివేశారు. తుఫాను కారణంగా ఎగువ ప్రాంతంలో కురుస్తున్న భారీ వర్షాలకు మైలవరం నుంచి పెన్నానది గుండా వరదనీటి ప్రవాహాన్ని బుధవారం ఉదయాన్నే పెంచారు. దీంతో పెన్నానదిలోకి వెళ్లే రహదారులకు కంపచెట్లు అడ్డంగా పెట్టి మూసివేశారు. గత రెండు నెలలకుపైగా కురిసిన భారీ వర్షాలకు వరద నీటి ఉధృతితో వేపరాల వద్ద జమ్మలమడుగు వద్ద రోడ్లు కోతకు గురయ్యాయి. అప్పటి నుంచి రాకపోకలు బంద్ అయ్యాయి. ప్రస్తుతం వరదనీరు విడుదల చేయడంతో ప్రమాదాలు జరుగకుండా దారిని మూసివేసినట్లు తహసీల్దారు శ్రీనివాసరెడ్డి, కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు.

31లోపు ప్లే స్కూల్ రికగ్నైజేషన్‌కు దరఖాస్తు చేసుకోవాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 19 (ఆంధ్రజ్యోతి): ప్రీ ప్రైమరీ (ప్లే స్కూల్) స్కూల్స్ రికగ్నైజేషన్ కోసం అక్టోబరు 31లోపు తప్పనిసరిగా దరఖాస్తు చేసుకోవాలని కడప మండల విద్యాశాఖ అధికారి హెచ్‌కే రఫిక్ అహమద్ ఒక ప్రకటనలో తెలిపారు. కడప మండల పరిధిలో నర్సరీ, ఎల్‌కేజీ, యూకేజీ తరగతులు నిర్వహిస్తున్న ప్లే స్కూల్స్ అక్టోబరు 31లోపు చలానా కట్టి పర్మిషన్ చేయించుకోవాలని తెలిపారు. పర్మిషన్ తీసుకోని పాఠశాలలను మూసివేస్తామని తెలిపారు. పర్మిషన్ లేకుండా నిర్వహించే పాఠశాలలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇతర వివరాలకు 9390129019 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

జాతీయస్థాయిలో స్కౌట్స్ అండ్ గైడ్స్ జిల్లా యూనిట్ లీడర్ అహ్మద్ ప్రతిభ



అవార్డు స్వీకరిస్తున్న అహ్మద్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): దక్షిణ కన్నడ జిల్లా మంగుళూరు ఆళ్వాస్ విద్యాసంస్థలో భారత స్కౌట్స్ అండ్ గైడ్స్ జాతీయ కార్యాలయం ఆధ్వర్యంలో నిర్వహించిన రోబోటిక్స్, ఏఐ, స్టెమ్, యూఈవీ అంశాలపై వారం రోజుల పాటు జాతీయ వర్క్‌షాప్ జరిగింది. మంగళవారం జరిగిన ముగింపు కార్యక్రమంలో విశిష్ట ప్రతిభ కనబరిచిన కడప జిల్లా యూనిట్ లీడర్ అహమ్మద్ సగినాల ఉత్తమ పురస్కారానికి ఎంపికయ్యారు. దేశవ్యాప్తంగా వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన యూనిట్ లీడర్ల మధ్య జరిగిన పోటీల్లో అహమ్మద్ సగినాల అత్యుత్తమ ప్రతిభతో గుర్తింపు పొందారు. జాతీయ కార్యాలయ గౌరవ అతిథులు మధుసూదన్ ఆవల, షిండియే తదితరుల చేతులమీదుగా పురస్కారం అందుకున్నారు. అంతేకాక రాష్ట్ర కంటిన్‌జెంట్ లీడర్ అవార్డు, బహుమతిని కూడా ఆయన అందుకోవడం విశేషం.

వందశాతం ప్లేస్‌మెంట్ రావాలి

- వీసీ ఆచార్య బెల్లంకొండ రాజశేఖర్



మాట్లాడుతున్న వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ రాజశేఖర్

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): విద్యాలయంలో చదివే ప్రతి విద్యార్థి అత్యున్నత కంపెనీలలో ప్లేస్‌మెంట్‌కి ఎంపికయ్యేలా వారిని తీర్చిదిద్దాలని వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బెల్లంకొండ రాజశేఖర్ స్పష్టం చేశారు. బుధవారం ఆయన తన చాంబర్‌లో ప్లేస్‌మెంట్ సెల్ డైరెక్టర్ ప్రొఫెసర్ విజయభారతి, సభ్యులు డాక్టర్ లలిత, డాక్టర్ గణేష్‌నాయక్‌లతో సమావేశమయ్యారు. ఈసందర్భంగా విద్యాలయంలో సంవత్సరాల వారీగా విద్యార్థుల వివరాలను ఆయన తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఎలాంటి నైపుణ్యాలు అవసరమో గుర్తించి అందుకు తగ్గ శిక్షణలు ఇచ్చేందుకు వనరుల గురించి ఒక ప్రణాళికను రూపొందించాలని సూచించారు. విద్యార్థులకు ఇచ్చే అన్ని రకాల నైపుణ్యాలకు నిధులు వెచ్చిస్తామన్నారు. ఇక నుంచి జాతీయ, ప్రపంచస్థాయి కంపెనీలలో మన విద్యార్థులకు ఉద్యోగాలు లభించాలన్నారు. ఎంబీఏ విభాగాధిపతి డాక్టర్ సరిత, ఎంసీఏ విభాగాధిపతి డాక్టర్ కె.శ్రీనివాస్‌రావులు వారి వారి శాఖలో వచ్చిన ప్లేస్‌మెంట్‌లను వివరించారు. సమావేశంలో డాక్టర్ జి.హరినాథ్, అసోసియేట్ ప్రిన్సిపాల్ డాక్టర్ రెడ్డయ్య తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీలకు సెప్టిక్ ట్యాంకు వాహనాలు మంజూరు

కడప ఎన్జీఓర్ సర్కిల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):జిల్లాలోని సఫాయి కార్మికులకు సెప్టిక్ ట్యాంకు వాహనాలు మంజూరు చేయనున్నట్లు ఎస్సీ కార్పొరే షన్ ఈడీ డాక్టర్ రాజ్యలక్ష్మి ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలోని ప్రొద్దుటూరు, జమ్మలమడుగు, బద్వేలు, పులివెందుల, మైదుకూరు మున్సిపాలిటీల నుంచి దరఖాస్తులు స్వీకరించనున్నట్లు తెలిపారు. ఎన్ఎస్‌కేఎఫ్‌డీసీ పథకం కింద అందించే ఈ వాహనాలకు ఐదుగురు అర్హులైన అభ్యర్థులు ఒక గ్రూపుగా ఏర్పడి మున్సిపల్ కమిషనరు ఆధ్వర్యంలో దరఖాస్తులు స్వీకరిస్తామని తెలిపారు.

దేశానికే ఆదర్శం మధ్యాహ్న భోజన పథకం



స్మార్ట్‌కిచెన్‌లో వంటల వివరాలను అడిగి తెలుసుకుంటున్న నీతి అయోగ్ జాయింట్ సెక్రటరీ సిద్ధార్థజైన్

సీకేదిన్నె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం దేశానికే ఆదర్శవంతంగా ఉందని నీతిఅయోగ్ జాయింట్ సెక్రటరీ, వైఎస్ఆర్ కడప ఆకాంక్షిత జిల్లా ప్రాబరి అధికారి సిద్ధార్థజైన్ తెలిపారు. చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజన పథకం స్మార్ట్‌కిచెన్‌ను కలెక్టర్ డాక్టర్ శ్రీధర్ చెరుకూరితో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా స్మార్ట్ కిచెన్‌ను సందర్శించి.. అక్కడ వంటల తీరు గురించి కలెక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ వివరిస్తూ దేశంలోనే తొలిసారిగా చింతకొమ్మదిన్నె జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.56లక్షలతో ఏర్పాటు చేసిన సెంట్రలైజ్డ్ అడ్వాన్స్ స్మార్ట్‌కిచెన్ ద్వారా ప్రతిరోజు 33 పాఠశాలలోని 1758 మంది విద్యార్థులకు రుచి, శుచికరమైన మధ్యాహ్న భోజనం అందుతోందన్నారు. డిసెంబరు చివరినాటికి 11 మండలాల్లో 33 స్మార్ట్ కిచెన్ల ద్వారా 1,24,689 మంది విద్యార్థులకు ఇదేరకమైన మంచి రుచి, శుచికరమైన పోషకాహారాన్ని అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. ప్రస్తుతం జిల్లాలో సీకేదిన్నెలో రెండు, జమ్మలమడుగులో రెండు, కడపలో ఒక స్మార్ట్ కిచెన్ల ద్వారా డొక్కా సీతమ్మ మధ్యాహ్న భోజనం పథకం కింద 136 పాఠశాలలకు చెందిన 10,332 మంది విద్యార్థులకు 13 ప్రత్యేక వాహనాల్లో ఆహారాన్ని పంపిణీ చేస్తున్నామని తెలిపారు. న్యూట్రిషనిస్టు పర్యవేక్షణలో సోలార్ పవర్‌తో పనిచేసే ఈ స్మార్ట్‌కిచెన్‌తో అత్యుత్తమ నాణ్యతా ప్రమాణాలు పాటిస్తున్నామన్నారు. స్మార్ట్ కిచెన్‌లో వంట తయారీ విధానం గురించి వంట నిర్వాహకులను నీతి అయోగ్ అధికారి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో ఏడీపీ నోడల్ అధికారి జోయల్ విజయకుమార్, విద్యాశాఖ ఆర్‌జేడీ శ్యామ్యూల్, డీఈవో శంసుద్దీన్, హౌసింగ్ పీడీ రాజారత్నం, సమగ్ర శిక్ష ఏసీపీ, ఇంజనీరింగ్ అధికారులు, రెవెన్యూ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీపీపీలో ఆగిన విద్యుదుత్పత్తి

ఎర్రగుంట్ల, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఆర్టీపీపీలో బుధవారం విద్యుదుత్పత్తి నిలిపివేశారు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాల నేపథ్యంలో విద్యుత్‌కు డిమాండ్ లేకపోవడంతో యూనిట్లను ఆపినట్లు సీఈ వాసుదేవరావు పేర్కొన్నారు. ఆర్టీపీపీలో మొత్తం ఆరు యూనిట్లలో 1,650 మెగావాట్ల సామర్థ్యంతో విద్యుదుత్పత్తి జరుగుతోంది. అయితే మొంథా తుపాన్ కారణంగా రాష్ట్రంలో పోల్స్ పడిపోవడం, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం కలగడంతో పాటు డిమాండ్ కూడా లేకపోవడం, దీనికి తోడు జలవిద్యుత్ కూడా ఫుల్‌గా వస్తుండటంతో ఆర్టీపీపీలోని 1, 2, 3, 6 యూనిట్లలో విద్యుదుత్పత్తిని ఆపినట్లు సీఈ తెలిపారు. 5వ యూనిట్ ఇదివరకే ఓవరాయిలింగ్‌కోసం షట్‌డౌన్‌లో ఉంది. 210 మెగావాట్ల సామర్థ్యంగల 4వ యూనిట్‌లో లోడ్ తగ్గించినట్లు తెలిపారు. రాష్ట్రంలో పరిస్థితి యథాస్థితికి రాగానే పై అధికారుల నుంచి వచ్చే ఉత్తర్వుల మేరకు మళ్లీ యూనిట్లను సర్వీసులోకి తీసుకుంటామన్నారు. ప్లాంటులో 1.5 లక్షల మెట్రిక్ టన్నుల బొగ్గు నిల్వలు ఉన్నాయన్నారు.



జార్ఖండ్ టస్సర్ స్కిల్స్ పురుగులు వైవీయూలో ప్రత్యక్షం



కడప ఎడ్యుకేషన్,అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జార్ఖండ్ రాష్ట్ర అడవుల్లో కనిపించే టస్సర్ సిల్క్ పట్టు పురుగులు (ఆంథిరా మిల్లిగా) యోగివేమన విశ్వవిద్యాలయం క్యాంపస్‌లో ప్రత్యక్షమయ్యాయి. జీవ వైవిధ్యానికి ప్రతీకగా వైవీయూ నిలుస్తోందని పరిశోధకులు తెలిపారు. నల్లమల, లంకమల అడవుల వృక్షజాతులను క్యాంపస్‌లో పెంచిన నేపథ్యంలో టెర్మినా లియా ఎలిపికా, టెర్మినాలియా అర్జునా వంటి చెట్లపై ఈ పురుగులు కనిపించాయి. పర్యావరణశాఖ విద్యార్థులు ఫీల్డ్‌వర్క్‌లో భాగంగా వీటిని గుర్తించారు. ఈ పురుగులు 5నుంచి 10 రోజులు మాత్రమే జీవిస్తాయని, 300 నుంచి 500 గుడ్లను పెట్టి అంతరించిపోతాయని, తర్వాత లార్వా, ప్యూప, కక్యూన్ దశల్లో టస్సర్ సిల్క్ ఉత్పత్తి జరుగుతుందని విద్యార్థులు అనిల్, సుమయిన యాస్మిన్ తెలిపారు.

పోలిశెట్టిపల్లెలో వ్యక్తి ఆత్మహత్య

చక్రాయపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని సురభి గ్రామం పోలిశెట్టిపల్లెలో బుధవారం మధ్యాహ్నం సిద్దయ్య (50) ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. స్థానికులు, పోలీసుల కథనం మేరకు..... సిద్దయ్యకు ఇంటి సమస్యలతో పాటు భూతగాదాలు ఉన్నాయి. దీనికితోడు అప్పులు ఎక్కువ కావడంతో దిక్కుతెలియని పరిస్థితిలో జీవితంపై విరక్తి చెంది నిప్పంటించుకున్నాడు. దీంతో అతనికి ప్రథమ చికిత్స చేయించి.. కడప రిమ్స్ ఆసుపత్రికి తరలించగా అక్కడ మృతి చెందినట్లు స్థానికులు చెబుతున్నారు. కాగా, సిద్దయ్య భార్య కూడా ఇటీవలే అదే ఇంట్లో ఆత్మహత్య చేసుకుంది. సిద్దయ్యకు ఒక కూతురు ఉండగా... ఆమెకు వివాహం చేయడంతో అత్తగారి ఇంటి వద్ద ఉంటోంది.

దంపతులపై చీటింగ్ కేసు నమోదు

కడప క్రైం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కడప నగరం ఆర్టీసీ బస్టాండు ప్రాంతానికి చెందిన దంపతులు ఓ ఉద్యోగికి ఇల్లు కొనిస్తామంటూ మోసగించడంపై చీటింగ్ కేసు నమోదు చేసినట్లు చిన్నచౌకు పోలీసులు తెలిపారు. భాగ్యనగర్ కాలనీకి చెందిన మాలె శివరామిరెడ్డి ట్రాన్స్‌కోలో ఏడీగా పనిచేస్తున్నారు. ఆయనకు పెట్రోలు బంకు నిర్వహిస్తున్న రామచంద్రారెడ్డి, ఆయన భార్య శ్యామలతో పరిచయం ఉంది. ఈ నేపథ్యంలో తక్కువ ధరకు స్థలం ఇప్పిస్తామంటూ దంపతులు మాయమాటలు చెప్పి శివరామిరెడ్డి వద్ద 2021లో రూ.54లక్షలు డబ్బులు తీసుకున్నారు. తీసుకున్న డబ్బులకు స్థలం చూపించకపోవడం, తాను ఇచ్చిన డబ్బులు తిరిగి ఇవ్వాలని శివరామిరెడ్డి కోరినా బెదిరింపులకు పాల్పడుతుండేవారు. ఈమేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో భార్యాభర్తలపై చీటింగ్ కేసు నమోదు చేసి విచారిస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

అంధకారంలో ట్రిపుల్‌ఐటీ

- ఏడు జనరేటర్లు ఉన్నా... పట్టించుకోని అధికారులు
- మూడేళ్లుగా ముళ్లపొదల మధ్య ఉన్న వైనం



ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో పనిచేయని జనరేటర్లు

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మూడు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ వైర్లు దెబ్బతిని ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. దీంతో ట్రిపుల్‌ఐటీ అంధకారంగా మారింది. ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీ క్యాంపస్‌లో 6వేల మంది, పాత క్యాంపస్‌లో ఒంగోలు ట్రిపుల్‌ఐటీకి చెందిన 2వేల మంది విద్యార్థులు చదువుతున్నారు. అక్కడ అధ్యాపకుల క్వార్టర్స్ కూడా ఉన్నాయి. ట్రిపుల్ ఐటీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయినపుడు వెంటనే జనరేటర్ల ద్వారా విద్యుత్ సరఫరా అయ్యేలా క్యాంపస్ మొత్తం ఏడు జనరేటర్లను ఏర్పాటు చేశారు. అయితే వాటిని పట్టించుకునేనాథుడే లేకపోవడంతో రెండు మూడేళ్లుగా పనిచేయడం లేదు. ముళ్లపొదల్లో పడేసినట్లుగా జనరేటర్లు ఉన్నాయి. ఈ నేపథ్యంలో మంగళవారం అర్ధరాత్రి కరెంటు సరఫరా నిలిచిపోయి విద్యుత్ లేక ట్రిపుల్‌ఐటీ విద్యార్థులు, అధ్యాపకులు ఇబ్బందులు పడ్డారు. కనీసం నీటి సరఫరాకు కూడా విద్యుత్ లేక అవస్థలు పడ్డారు. జనరేటర్ల నిర్వహణ గురించి గాలికి వదిలేయడంపై విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా జనరేటర్లను మరమ్మత్తు చేయించి పనిచేసేలా ట్రిపుల్‌ఐటీ అధికారులు దృష్టిసారించాల్సిన అవసరం ఉంది. ఈ సమస్యను ఆర్జీయూకేటీ రిజిస్ట్రార్ అమరేంద్ర కుమార్ దృష్టికి తీసుకెళ్లగా వారం రోజుల్లోగా మరమ్మత్తులు చేయించి పనిచేసేలా చూస్తామన్నారు.

విద్యుత్ సిబ్బంది మరమ్మతు పనులు

ట్రిపుల్‌ఐటీలో మంగళవారం అర్ధరాత్రి విద్యుత్ లైన్లకు ఏర్పడ్డ అంతరాయంతో ఓల్డ్ క్యాంపస్‌కు కరెంటు సరఫరా నిలిచిపోయింది. వేకువజామునే వేంపల్లె విద్యుత్ సిబ్బంది ట్రిపుల్‌ఐటీకి చేరుకొని యుద్ధ ప్రాతిపదికన మరమ్మత్తు పనులు చేపట్టారు. బుధవారం 10గంటల ప్రాంతంలో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు.

భూ వివాదంతో ఘర్షణ

- నలుగురిపై కేసు నమోదు

పులివెందుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని నల్లపురెడ్డిపల్లె గ్రామంలో బుధవారం భూ వివాదంపై ఘర్షణ జరగడంతో నలుగురిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు. నల్లపురెడ్డిపల్లె గ్రామానికి చెందిన శంకరప్ప, వెంగముని ఇరువురు భూ విషయమై ఘర్షణకు దిగారు. ఈ ఘర్షణకు సంబంధించి శంకరప్ప ఫిర్యాదు మేరకు వెంగముని, గంగయ్య మరో ఇరువురు మహిళలపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

విద్యుత్‌షాక్‌తో వ్యక్తి మృతి

లింగాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని దొండ్లవాగు గ్రామంలో గొడ్డలి వెంకటరాములు (60) అనే వ్యక్తి విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. ఎస్ఐ అనిల్ కుమార్ వివరాల మేరకు.. వెంకటరాములు తన ఇంటిలో బుధవారం విద్యుత్ స్విచ్‌బోర్డుకు మరమ్మత్తులు చేస్తుండగా విద్యుత్‌షాక్‌కు గురై అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య అనంతమ్మ, కుమారుడు ఉన్నారు. ఆ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ తెలిపారు.

వర్షాలతో సమస్యలకు శాశ్వత పరిష్కారం



డ్రైనేజీ వ్యవస్థను పరిశీలిస్తున్న టీడీపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసరెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వర్షాల కారణంగా వరదనీరు నిలిచిపోకుండా శాశ్వత పరిష్కారానికి చర్యలు చేపడుతున్నట్లు టీడీపీ పొలిట్ బ్యూరో సభ్యుడు ఆర్.శ్రీనివాసరెడ్డి తెలిపారు. బుధవారం కడపనగరం అప్సర సర్కిల్ పరిసర ప్రాంతాల్లో వర్షాల కారణంగా ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు శాశ్వత పరిష్కారం కోసం జరుగుతున్న పనులు ఆయన స్వయంగా పరిశీలించారు. అలాగే బుగ్గవంక ప్రాంతంలోని షామీర్య బ్రిడ్జి, జువైనెల్ హోం సమీప ప్రాంతాల్లో వర్షపునీటి ప్రవాహ పరిస్థితిని ప్రత్యక్షంగా సమీక్షించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఇటీవల వర్షాలతో ఎదురైన ఇబ్బందులు మళ్లీ రాకుండా నగరంలో నీటి పారుదల వ్యవస్థను పూర్తిగా మెరుగుపరిచేదిశగా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో కార్పొరేషన్ అధికారులు, టీడీపీ నాయకులుపాల్గొన్నారు.

పరిశుభ్రత, తాగు నీటి సరఫరాపై శ్రద్ధ వహించాలి



మాట్లాడుతున్న రాజ్యలక్ష్మి

సింహాద్రిపురం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పరిశుభ్రతతోపాటు, స్వచ్ఛమైన తాగు నీరు ప్రజలకు అందించేందుకు గ్రామ కార్యదర్శులు శ్రద్ధ వహించాలని జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి పేర్కొన్నారు. బుధవారం సింహాద్రిపురం ఎంపీడీఓ కార్యాలయంలో జిల్లా పంచాయతీ అధికారి రాజ్యలక్ష్మి, కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, సర్వే అసిస్టెంట్లతో స్వామిత్వపై రివ్యూ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాసరెడ్డి, ఇన్‌చార్జ్ డిప్యూటీ ఎంపీడీఓ వెంకటరాముడు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

బ్రౌన్ జయంతి నిర్వహణ నిర్ణయం హర్షణీయం

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సీపీ బ్రౌన్ జయంతిని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం అధికారికంగా నిర్వహించడానికి తలపెట్టడం హర్షణీయమని ఆంధ్రప్రదేశ్ అభ్యుదయ రచయితల సంఘం కడప జిల్లా శాఖ అధ్యక్షుడు డాక్టర్ ఎస్.ఈశ్వరరెడ్డి, ప్రధాన కార్యదర్శి డాక్టర్ తుమ్మలూరు సురేష్‌బాబు ఒక సంయుక్త ప్రకటనలో హర్షం వ్యక్తం చేశారు. సీపీ బ్రౌన్ పూనుకోకుంటే విశ్వకవి వేమన మనకు లభించేవాడు కాదని తెలిపారు.

చినుకుపడితే ఛిద్రం..!

అధ్వాన స్థితిలో ఆయకట్టు రోడ్లు ● ఇబ్బందుల్లో రైతులు

చెన్నూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వారం రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలం లోని ఆయకట్టు రోడ్లు అత్యంత దారుణంగా తయారయ్యాయి, ఏ దారి గుండా వెళ్లాలన్నా గుంతలు,



చెన్నూరు ఆర్‌అండ్‌బీ రోడ్డు వద్ద నుంచి ముండ్లపల్లె రోడ్డు వరకు దారుణంగా ఉన్న ఆయకట్టురోడ్డు

పట్టుతప్పితే జారిపడే పరిస్థితి. అడుగడుగునా బురదమయమే. ఇలాంటి పరిసితుల్లో రైతులు ఖరీఫ్‌లో వరి కోస్తున్నారు ధాన్యాన్ని ఇలాంటి దారి గుండా ఇళ్లకు ఎలా చేర్చుకోవలంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా అటు చెన్నూరు అరుంధతీ నగర్ నుంచి పెద్దకాల్వ, రామనపల్లె రోడ్డు, అక్కడ నుంచి ముండ్లపల్లె, గుర్రంపాడు రోడ్డు వరకు ఆయకట్టు రోడ్డు అత్యంత అధ్వానంగా మారింది. కనీసం అడుగు పెడితే మరో అడుగు ముందుకు వేయలేని పరిస్థితి, దీంతో పాటు కేవోఆర్ కాలనీ నుంచి రామనపల్లె రోడ్డు వరకు ఉన్న మట్టి రోడ్డు కూడా ఇదే పరిస్థితి ఉంది.

ఆయకట్టు రోడ్లన్నీ అధ్వానమే..: మండల వ్యాప్తంగా ప్రతి గ్రామపంచాయతీలో ఉన్న ఆయకట్టు రోడ్లు అత్యంత దారుణంగా ఉ న్నాయి. వేసవి కాలం తప్పిస్తే మిగతా కాలమంతా చినుకు పడిందంటే దార్లు దారుణమే. కిలోమీటరు, రెండు కిలోమీటర్లు కాదు చాలా వరకు ఆయకట్టు రోడ్ల పరిస్థితి ఇదే. కంకర రోడ్డు వేస్తే పదికాలాల పాటు పదిలంగా ఉంటుంది కేవలం మట్టి రోడ్లు వేయడంతో చినుకు పడ్డప్పుడల్లా మోకాటి గుంతలే.

నిధుల కోసం ఎదురు చూపు..

ఎన్నో ఏళ్లగా మండలంలో ఆయకట్టు రోడ్ల పరిస్థితి దారుణం. వచ్చిన నిధులు మండలంలో సీసీ రోడ్లు వేసేందుకు మాత్రం ఉపయోగపడుతున్నాయి. అయితే రైతుల పరిస్థితి ఏంటని అంటున్నారు. 20 ఏళ్లక్రితం అప్పటి టీడీపీ పాలనలో జన్మభూమి, ప్రజల వద్దకు పాలన సమయంలో గ్రామ గ్రామానికి లింకు రోడ్డుగా ఆయకట్టు రోడ్డుభద్రంగా వేశారు. ఫలితంగా మండల కేంద్రాన్ని మారుమూల గ్రామాల్లో సైతం దగ్గర దారులతో కలిసి వచ్చాయి. ఆ తరువాత వచ్చిన



యల్లమ్మ దేవాలయం నుంచి రామనపల్లె రోడ్డు

పాలకులు 2004-14 మధ్య రోడ్ల పరిస్థితి మాత్రం అంతంతే. ఆ తరువాత వచ్చిన టీడీపీ పాలనలో కొద్ది వరకు మెరుగు. ఆ తరువాత వచ్చిన వైసీసీ పాలన మరీ అధ్వానంగా మారింది. ఇప్పుడున్న కూటమి పాలనలో అయినా రైతుల పరిస్థితి అర్థం చేసుకుని నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

టెట్ అభ్యర్థులకు ఫీజు తగ్గించాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయ అర్హత పరీక్ష (ఏపీ టెట్)రాయబోయే అభ్యర్థులకు పరీక్ష ఫీజును తగ్గించాలని ఉపాధ్యాయ సంఘాల సమన్వయ వేదిక రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఒంటేరు శ్రీనివాసులరెడ్డి బుధవారం విద్యాశాఖమాత్యులు నారాలోకేశ్‌కు లేఖ రాశారు. పరీక్ష రాసే అభ్యర్థులకు ప్రతి పేపర్‌కి రూ.1000ల ఫీజును కేటాయించడం జరిగిందని, ఇంత పెద్దమొత్తం చెల్లించాలంటే అభ్యర్థులకు భారంగా మారుతోందని చెప్పారు.

పక్కాగృహాలకు దరఖాస్తు చేసుకోండి

చెన్నూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం పేదలకు పక్కాగృహాలు అందించాలన్న లక్ష్యంతో ప్రధానమంత్రి గ్రామీణ ఆవాజ్ పథకాన్ని విడుదల చేసిందని మండల హౌసింగ్ ఏఈ మినిల్ కుమార్ అన్నారు. ఈ మేరకు బుధవారం మాట్లాడుతూభార్యాభర్తల ఆధార్,రేషన్, పొసెషను సర్టిఫికెట్, కుల,ఆదాయ ధృవీకరణ పత్రాలు, జాబ్‌కార్డు, బ్యాంకు పాస్ బుక్కు, జిరాక్స్ ప్రతులను దరఖాస్తుతో జత చేసి మండల హౌసింగ్ ఏఈ కార్యాలయంలో ఇవ్వాలని తెలిపారు. అలాగే పక్కాగృహానికి ప్రభుత్వం లక్షా 20వేలు మంజూరు చేస్తుందని అలాగే ఉపాధి హామీ పథకం ద్వారా 90 పనిదినాలకు మరుగుదొడ్డినిర్మాణానికి 12వేలు మంజూరు చేస్తుందన్నారు.

ప్రతి రైతుకు విత్తనాలు అందిస్తాం

కమలాపురం రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):ప్రతి రైతుకు శనగ విత్తనాలు అందిస్తామని ఏవో సరస్వతి తెలిపారు. బుధవారం మండల పరిధిలోని పలు గ్రామాల్లో శెనగ విత్తనాల పంపిణీ కేంద్రాల్లో రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఆమె పరిశీలించారు.



కుటుంబాలను వీధులపాలు చేయొద్దు

కడప సెవెన్‌రోడ్స్, అక్టోబరు29 (ఆంధ్రజ్యోతి): ఎన్నో ఏళ్లగా విధులు నిర్వహిస్తున్న తమను ఉన్న ఫళంగా విధులకు రావద్దని చెబితే మా కుటుంబాలు రోడ్డునపడతాయని సర్వజన ఆసుపత్రి పారిశుధ్య సూపర్‌వైజర్లు వాపోతున్నారు. కడప నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి రిమ్స్‌లో కొత్తగా ఏర్పాటైన శానిటేషన్ యాజమాన్యం తమను ఉద్యోగాలకు రావద్దనడంతో శానిటేషన్ సూపర్‌వైజర్లు గందరగోళానికి గురవుతున్నారు. నూతనంగా శానిటేషన్ కాంట్రాక్టు తీసుకున్న యాజమాన్యం గతంలో పనిచేస్తున్న పారిశుధ్య సూపర్‌వైజర్లకు విద్యార్హత వయసు తదితర నిబంధనలను చూపిస్తూ ఉద్యోగాల నుంచితొలగించడాన్ని వ్యతిరేకిస్తున్నారు. ఈ విషయమై ఆసుపత్రి సూపరింటెండెంట్‌కు, అడ్మినిస్ట్రేటర్, డిప్యూటీ కలెక్టర్‌కు వినతిపత్రం అందించారు.

రైతులకు పుష్కలంగా సాగునీరు

హెచ్‌ఎల్సీ చైర్మన్ జోగిరెడ్డి



స్విచ్ ఆన్ చేస్తున్న జోగిరెడ్డి

లింగాల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): సీబీఆర్ (చిత్రావతి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్) ప్రాజెక్టు నిండడంతో ఆయకట్టు రైతులకు పుష్కలంగా సాగునీరు ఇచ్చేందుకు అవకాశం ఏర్పడిందని తుంగభద్ర ప్రాజెక్టు హైలెవెల్ కెనాల్ చైర్మన్ జోగిరెడ్డి అన్నారు. మండలంలోని పార్నపల్లె సమీపంలో ఉన్న సీబీఆర్ ప్రాజెక్టు గేట్‌ఎత్తి చిత్రావతినదిలోకి ఆయన నీటినివిడుదల చేశారు. ప్రస్తుతం ప్రాజెక్టులో 9.2టీఎంసీల నీరు ఉంది, పూర్తిసామర్థ్యం 10.24టీఎంసీలు, ఇన్‌ఫ్లో 3వేలక్యూసెక్కులు ఉంటే నదిలోకి 2వేలక్యూసెక్కులు విడుదల చేశారు. ఆర్డీఓ చిన్నయ్య, లింగాల మండల టీడీపీ అధ్యక్షుడు విశ్వనాథ్‌రెడ్డి, పులివెందుల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ అమర్‌నాథ్, ధనుంజయనాయుడు, నీటిపారుదల శాఖఅధికారులు తదితరులు పాల్గొన్నారు.

కుప్పం హైలెవెల్ బ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలి

చక్రాయపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కుప్పం-రాచుపల్లె మధ్యలో పాపాఘ్ని నదికి అడ్డంగా నిర్మించిన హైలెవెల్ బ్రిడ్జిని వెంటనే ప్రారంభించాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు కె.రామచంద్రారెడ్డి కలెక్టర్ కు ఫిర్యాదు చేశారు. మొంథా తుఫాన్ కారణంగా తాత్కాలికంగా వేసిన రోడ్డు రెండు రోజులుగా కురిసిన వర్షాలకు తెగిపోయే స్థితిలో ఉందన్నారు. అలాగే మట్టిరోడ్డు కావడంతో వాహన చోదకులు జారిపడుతున్నారన్నారు. ప్రమాదం జరిగితే పాపాఘ్నిలో పడిపోతారన్నారు.

ఉపాధ్యాయుడిపై చర్యలు తీసుకోవాలి

కడప నాగరాజుపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): బ్రహ్మంగారిమఠం మండలం కందిమల్లాయపల్లె మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థినులతో అసభ్యకరంగా ప్రవర్తించిన ఉపాధ్యాయునిపై చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి వీరణాల శివకుమార్ ప్రశ్నించారు. బుధవారం డీవైఎఫ్‌ఐ జిల్లా కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ విద్యార్థినిల పట్ల అసభ్యకరంగా ప్రవర్తించిన తీవ్రమైన ఆరోపణలు వచ్చినా విద్యాశాఖ ఎందుకు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు.

ఆనకట్టను పరిశీలించిన ఆర్డీవో

వల్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను ప్రభావంతో వివిధప్రాంతాల్లో వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో మండలపరిధిలోని ఆదినిమ్మాయపల్లె ఆనకట్టను కడప ఆర్డీవో జాన్ ఇర్విన్ బుధవారం పరిశీలించారు. ఆనకట్ట ప్రస్తుత నీట మట్టం, గేట్ల స్థితి, నిర్వహణ చర్యల గురించి విధి నిర్వహణలో ఉన్న అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. మైలవరం డ్యాం నుంచి పెన్నానదికి నీటిని వదలడంతో ఆదినిమ్మాయపల్లె ఆనకట్టకు నీటి ప్రవాహం పెరగవచ్చని ఆర్డీవో తెలిపారు. అధికారులు ముందస్తుగా అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో తహసీల్దారు శ్రీవాణి, పంచాయతీ కార్యదర్శి స్వప్న,అధికారులు పాల్గొన్నారు.

విధి నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు

పులివెందుల రూరల్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం మెరుగుపరిచి ఆరోగ్యకరవాతావరణం కల్పించాలని జిల్లా పంచాయతీ అధికారి జి.రాజ్యలక్ష్మి సూచించారు. బుధవారం మండలకేంద్రమైన తొండూరు ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష నిర్వహించారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో విష్ణుప్రసాద్, డిప్యూటీ ఎంపీడీవో రమాదేవి, పరిపాలన అధికారి శౌరిరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

గోవుల ఆహార సంరక్షణ పుణ్యప్రదం



చెన్నూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):గోవుల ఆహార సంరక్షణ పుణ్యప్రదమని చెన్నూరు మల్లేశ్వరస్వామి ఆలయం ప్రధాన అర్చకుడు ఆంజనేయశర్మ అన్నారు. కార్తీక మాసం గోపాష్టమి సందర్భంగా స్థానిక శివాలయంలో గోపూజా తులాదానం నిర్వహించారు. ఇందులో పలువురు కుటుంబ సభ్యులు తమబిడ్డలను తీసుకువచ్చి అక్కడ త్రాసుపై తూచి వారి బరువు మేర ధాన్యం, బెల్లం, తౌడులాంటివి సమర్పించారు.

తాగునీటి సమస్యను పరిష్కరించండి

వేంపల్లె, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఇడుపులపాయ ట్రిపుల్‌ఐటీలో తాగునీటి సమస్య ఉందని, మారుతీనగర్‌లో పైప్‌లైన్ లీకేజీలు ఉన్నాయని జనసేన నాయకులు, ఇడుపులపాయ మాజీ సర్పంచు చలపతి, ఎంపీడీఓ కుళాయమ్మకు తెలిపారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని బుధవారం వినతిపత్రం అందించారు. పక్కనే పాపాఘ్ని నది ఉన్నా తాగునీటి సమస్య ఉండడం శోచనీయమని అధికారులు వెంటనే చర్యలు తీసుకొని గ్రామానికి తాగునీరు సరఫరా అయ్యేలా చూడాలన్నారు. వీధిలైట్లు వెలగడం లేదని పునరుద్ధరించాలని ఎంపీడీఓను కోరగా సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ లక్ష్యం



ప్రజాదర్బార్‌లో బీటెక్ రవి

పులివెందుల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు తీర్చడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని పులివెందుల నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్సీ మారెడ్డి రవీంద్రనాథరెడ్డి (బీటెక్ రవి) పేర్కొన్నారు. బుధవారం బీటెక్ రవి టీడీపీ కార్యాలయంలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నియోజకవర్గం నుంచి పలుమండలాల నుంచి ప్రజలు, కార్యకర్తలు పెద్దఎత్తున తరలివచ్చారు.

ప్రభుత్వ లక్ష్యం స్ఫూర్తిదాయకం

కడప కలెక్టరేట్, అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం అందుకొనే స్థాయినుంచి ఉద్యోగాలు అందించే స్థాయికి యువత ఎదగాలన్న ప్రభుత్వ లక్ష్యం స్ఫూర్తిదాయకమని నీతి అయోగ్ జాయింట్ సెక్రటరీ, ఆకాంక్షిత కడప జిల్లా ప్రాబరీ అధికారి సిద్ధార్థ జైన్ ప్రశంసించారు. బుధవారం కడప ఆర్ట్స్ కళాశాల సమీపంలో నిర్మాణంలో ఉన్న పీ-4 స్టార్టప్ కడప హబ్ సెంటర్ నిర్మాణ పనులను కలెక్టర్ చెరుకూరి శ్రీధర్‌తో కలసి ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆశించే స్థాయి నుంచి శాసించే స్థాయికి ఎదగాలంటే ప్రతి ఇంటినుంచి ఒక స్టార్టప్ రావాలనే ఆలోచన ఆదర్శనీయమన్నారు. ఇలాంటి స్టార్టప్‌ను ఆకాంక్ష జిల్లా కడపలో ప్రపథమంగా ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. హౌసింగ్ పీడీ రాజరత్నం, ఆకాంక్షిత జిల్లా నోడల్ అధికారి విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

'ఆ ఎన్నికను ప్రభుత్వం రద్దు చేయాలి'

కడప మారుతీనగర్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): వీరబ్రహ్మంగారిమఠంలో ఇటీవల జరిగిన సంబంధిత మఠాధిపతి ఎంపిక ప్రక్రియ సాధారణ ఎన్నికలను తలపించేలా సాగిందని వీరబ్రహ్మేంద్రస్వామి ప్రచార పరిషత్ వ్యవస్థాపక అధ్యక్షుడు పాలెపు శ్రీనివాసులు ఆరోపించారు. బుధవారం స్థానిక ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. మఠానికి సంబంధించిన స్వామివారి శిష్యులను సైతం గుర్తించకుండా సాధారణ ప్రజలను బతిమాలి డబ్బులు ఇచ్చి ఆర్భాటపు ప్రచారం చేసి గుంపులుగా వెంట తీసుకువచ్చి ఓటింగ్ ప్రక్రియ సాగించడం దారుణమన్నారు. మఠం ఆచారాలకు విరుద్ధంగా ఒక రాజకీయ ఎన్నిక మాదిరిగా బలప్రదర్శనకు వేదికగా మఠం నిలవడం బాధాకరమన్నారు. తక్షణమే ఆ ఎన్నిక ప్రక్రియను ప్రభుత్వం రద్దు చేయాలని డిమాండ్ చేశారు. బ్రహ్మంగారిమఠం వారసుడు గోవిందస్వామిని పీఠాధిపతిగా నియమించాలని కోరారు. సమావేశంలో మఠం వారసుడుగోవిందస్వామి పాల్గొన్నారు.

నిర్లక్ష్యపు అధికారులపై చర్యలు తీసుకోవాలి



ముళ్లపొదలల్లో తుప్పుపట్టిన వాహనాలను పరిశీలిస్తున్న సీపీఎం సభ్యులు

కడపసెవెన్ రోడ్స్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో చెత్త సేకరణకు మినీ ట్రాక్టర్లు, గూడ్స్ ఆటోలు, పూడిక తీత యంత్రాలు ఎస్సీ కార్పొరేషన్ ద్వారా నిరుద్యోగులకు అందించాల్సిన స్వయం ఉపాధి పథకాలు యూనిట్లు ఆరు సంవత్సరాలుగా వందలాది వాహనాలు తుప్పుపట్టి, 25కోట్ల రూపాయలు ప్రజాధనం దుర్వినియోగం చేసిన అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రామ్మోహన్ రెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం 48వ డివిజన్ ప్రజాచైతన్య యాత్రలో భాగంగా మహిళా ప్రాంగణంలో లబ్ధిదారులకు ఇవ్వకపోవడంతో తుప్పుపట్టిన వాహనాలను సీపీఎం బృందం పరిశీలించారు. వాహనాలు తుప్పుపట్టడానికి కారకులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు దస్తగిరిరెడ్డి, చంద్రారెడ్డి, రామ కృష్ణారెడ్డి, నరసింహ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.



నరకదారులు



తిలక్‌నగర్ వద్ద గుంతలు



రాజంపేట బైపాస్ రోడ్డులో వైఎస్ఆర్ సర్కిల్ నుంచి ఇర్కాన్ సర్కిల్‌కు పోయే మార్గం

రెండురోజులుగా [illegible] దీంతో [illegible] పెద్ద [illegible] తీసుకోవాలని [illegible]

ఫొటోలు: స్టాఫ్‌ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి

ఉపాధ్యాయులు గంట ముందు పాఠశాలల్లో ఉండాలి

కడప ఎడ్యుకేషన్, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి):కడప మండల పరిధిలో ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాఠశాల సమయానికన్నా ఒక గంట ముందు పాఠశాలల్లో ఉండాలని ఎంఈవోలు హెచ్‌కె రఫిక్ అహ్మద్, ఎస్.ఇర్షాద్ అహ్మద్ ఒక సంయుక్త ప్రకటనలో తెలిపారు. మూడు రోజుల నుంచి తుఫాన్ కారణంగా వర్షాలు విపరీతంగా కురవడంతో పాఠశాల చుట్టు ఎక్కల ఉన్న పాములు, తేళ్లు వంటి హానికరమైన ప్రాణులు పాఠశాలలకు చేరే అవకాశం ఉందన్నారు. ఉపాధ్యాయులందరూ పాఠశాల సమయం కన్నా ఒక గంటముందు వెళ్లి పాఠశాలను శుభ్రం చేయించాల్సిందిగా వారు సూచించారు.

పంటలను ముంచెత్తిన మొంథా

- పోరుమామిళ్లలో 750 ఎకరాల్లో దెబ్బతిన్న ఉద్యాన పంటలు
- చెరువులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే విజయమ్మ
- తుఫాన్ బాధిత ప్రాంతాల్లో పర్యటించిన టీడీపీ నేత భూపేశ్‌రెడ్డి



గోపవరంలోని సంద్రపల్లె చెరువును పరిశీలిస్తున్న మాజీ ఎమ్మెల్యే విజయమ్మ



జమ్మలమడుగులోని ధర్మాపురం వరి పంటను పరిశీలిస్తున్న టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి, అధికారులు



బి.కోడూరులో దెబ్బతిన్న వరి పంటను పరిశీలిస్తున్న ఏవో

పోరుమామిళ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుపాను చేతికి వచ్చే పంటలను ముంచెత్తడంతో అన్నదాతలు ఆందో ళనలో పడ్డారు. తుఫాన్ తాకిడికి పోరుమామిళ్ల ఉద్యానశాఖ డివిజను పరిధిలో 750 ఎకరాల్లో ఉద్యానవన పంటలు దెబ్బతిని రైతులకు నష్టం వాటిల్లిందని ఉద్యానశాఖాధికారి శ్రీనివాసులరెడ్డి తెలిపారు. పోరుమామిళ్ల డివిజను పరిధిలోని పోరుమామిళ్ల, కలసపాడు, కాశినాయన, బి.కోడూరు, బిమఠం మండలాలకుసంబంధించి 500 ఎకరాల్లో ఉల్లి, వంద ఎకరాల్లో ఎండుమిర్చి మిగిలిన పసుపు, మినుము, పచ్చిమిర్చి తదితర పంటలు దెబ్బతిన్నాయన్నారు. వాటిని అంచనా వేసి ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లామన్నారు. ఈ తుఫాను తాకిడికి పోరుమామిళ్ల మండలం లో దాదాపు పోరుమామిళ్ల, టేకూరుపేట, సిద్దవరం, రజాసాహెబ్‌పేట, సూరిసిద్దుపల్లె, కవలకుంట్ల తదితర ప్రాంతాల్లో మొత్తం 750 ఎకరాల్లో వరి దెబ్బతిని రైతులకు నష్టం వాటి ల్లిందని వ్యవసాయశాఖాధికారి చంద్రమోహన్ రెడ్డి తెలిపారు. అలాగే వంద ఎకరాల్లో మొక్క జొన్న తడిచి మొలకలు వచ్చాయన్నారు. వీట న్నింటినీ ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి రైతులకు నష్టపరిహారం అందేలా చూస్తామన్నారు. గం డి పడ్డ అక్కల్‌రెడ్డిపల్లె చెరువును మాజీ ఎమ్మె ల్యే విజయమ్మ పరిశీలించారు. చెరువుకు పడిన గండిని పూడ్చాలని ఆమె అధికారులను ఆదేశం చారు. కార్యక్ర మంలో కూటమి నేత రోశన్న, టీడీపీ నాయ కుడు జయరాములు పాల్గొన్నారు. తుఫాను నేపథ్యంలో వరద నీరు మల్దేవి ద్వారా పోరుమామిళ్ల, ముదిరెడ్డిపల్లె ఎరసాల రజా సాహెబ్‌పేట చెరువులకు చేరింది.



పోరుమామిళ్ల మండలంలో కోతకు గురైన పొలం

చెరువులను పరిశీలించిన మాజీ ఎమ్మెల్యే

గోపవరం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను నేపథ్యంలో గోపవరం మండలంలోని సంద్రపల్లె, సంగసముద్రం చెరువులను మాజీ ఎమ్మెల్యే విజయమ్మ బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు బద్వేలు ఆర్డీవో చంద్రమోహన్, ఎంఎస్‌వో, ఇరిగేషన్ డీఈఈ, విభాగ అధికారులు, గోపవరం తహసీల్దారు త్రిభువన్‌రెడ్డి పాల్గొన్నారు. ఏపీఐఐసీ డైరెక్టరు ప్రసాద్‌రెడ్డి, బద్వేలు మున్సిపాలిటీ టీడీపీ అధ్యక్షుడు గుర్రంపాటి వెంగల్‌రెడ్డి, గోపవరం మండల టీడీపీ అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు టెంకాయల నాయుడు, వైస్ ఎంపీపీ రామ్మోహన్‌రెడ్డి, మల్లెంకొండ దేవస్థానం చైర్మన్ మల్లెం కొండయ్య, రామసుబ్బారెడ్డి, ఎల్లారెడ్డి, ఆదామ; సత్యనారాయణ పాల్గొన్నారు.

పంటలను పరిశీలించిన భూపేశ్‌రెడ్డి

జమ్మలమడుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగు మండలంలోని ధర్మాపురం, గొరిగెనూరు గ్రామాల్లో దెబ్బతిన్న వరి పొలాలను టీడీపీ ఇన్‌చార్జి భూపేశ్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. తుఫాను వలన జమ్మలమడుగు ప్రాంతంలో పంటలు దెబ్బతిన్నాయని, కొందరి ఇళ్లు దెబ్బతిన్నాయని తెలిపారు. ఈసందర్భంగా భూపేశ్‌రెడ్డి మాట్లాడుతూ మొంథా తుఫాను వలన నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకుంటుందన్నారు. మండల వ్యవసాయాధికారి నర్రెడ్డి శ్రీకాంత్‌రెడ్డి పంట దెబ్బతిన్న పొలాలను పరిశీలించి నివేదికలను వెంటనే అధికారులకు పంపాలని ఆయన సూచించారు. అలాగే నియోజకవర్గంలోని పలు ప్రాంతాల్లో ఆయన పర్యటించి పరిశీలించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డు చైర్మన్ సింగంరెడ్డి నాగేశ్వరరెడ్డి, వైస్‌చైర్మన్ మల్లికార్జున, టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి శ్రీనివాసులు, సర్పంచ్ రామాంజనేయరెడ్డి, రైతులు పాల్గొన్నారు.

పెద్దముడియంలో: తుఫాను కారణంగా ప్రజలకు ఎలాంటి సమస్యలు రాకుండా చూడాలని జమ్మలమడుగు టీడీపీ ఇన్‌ఛార్జ్ భూపేశ్‌రెడ్డి అధికారులకు సూచించారు. మండల పరిధిలోని నెమళ్లదిన్నె గ్రామాన్ని బుధవారం ఆయన సందర్శించి తుఫాను వల్ల జరిగిన నష్టం తదితర విషయాల గురించి ప్రజలతో చర్చించారు. త్వరలో రాజోలి సమస్యను ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డితో కలిసి సీఎం చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం చూపుతామని ముంపు వాసులకు పరిహారం వచ్చేలా కృషి చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, విఘ్నేశ్వర్‌రెడ్డి, సింగిల్‌విండో ప్రెసిడెంటు పురుషోత్తంరెడ్డి ఇతర నాయకులు, టీడీపీ అభిమానులు పాల్గొన్నారు.

వర్షానికి వరి, మినుము నేలమట్టం

బి.కోడూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండలంలో వరి 300 ఎకరాలు, మినుము 50 ఎకరాలు, మిరప 20 ఎకరాలు పూర్తిగా నేలమట్టమైంది. దీంతో రైతులు చేతికొచ్చిన పైరు పూర్తిగా నీటిపాలు కావడంతో ప్రభుత్వం ఆదుకోవలని కోరుతున్నారు. వర్షాలకు దెబ్బతిన్న పంట పొలాలను వ్యవసాయాధికారి కౌశిక పరిశీలించారు. రైతులతో ఆమె మాట్లాడుతూ వర్షం నీళ్లు వరిలో లేకుండా పూర్తిగా తెంచాలని కూలీలతో కింద పడ్డ వరిని నిలబెట్టి కట్టలుగా కట్టాలని దీంతో గింజ మొలక రాకుండా ఉంటుందని ఆమె అన్నారు. అలాగే మినుము పంట పరిశీలించారు.

ఎల్ఎస్‌పీకి భారీగా వరద నీరు

మండలంలో లోయరు సగిలేరు ప్రాజెక్టుకు ఎగువన కురిసిన వర్షాలకు భారీగా వచ్చి నీరు చేరుతోంది. దీంతో 7500 క్యూసె క్కుల నీటిని దిగువ ఏటికి విడుదల చేశారు. అలాగే బద్వేలు పెద్ద చెరువుకు 250 క్యూసె క్కులు విడుదల చేసినట్లు ఇరిగేసన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి తెలిపారు.



బి.కోడూరు వద్ద ఎల్ఎస్‌పీ డ్యాం నుంచి దిగువకు విడుదల చేసిన నీరు

బద్వేలులో డ్రైనేజీ వ్యవస్థను పరిశీలించిన కలెక్టర్



అధికారులకు సూచనలు ఇస్తున్న కలెక్టర్ శ్రీధర్ చెరుకూరి

బద్వేలు , అక్టోబరు 29(ఆంధ్రజ్యోతి) : బద్వేలు నియోజకవర్గ పర్యటనలో భాగంగా బుధవారం సాయంత్రం బద్వేలు మున్సిపాలిటీ పరిధిలోని గుంతపల్లె పంచాయతీ పరిధిలో డ్రైనేజీ వ్యవస్థను కలెక్టర్ డాక్టర్ చెరుకూరి శ్రీధర్ పరిశీలించారు. అనంతరం లక్ష్మీపాళెం పరిధిలోని బద్వేలు పెద్ద చెరువును పరిశీలించి చెరువు విస్తీర్ణం, ఆయకట్టు విస్తీర్ణం, నీటి వాడకం తదితర అంశాలను నీటి సంఘం సభ్యులు, ఇరిగేషన్ శాఖాధికారుల ద్వారా అడిగి తెలుసుకున్నారు. చాలా సంవత్సరాల తర్వాత పూర్తిస్థాయిలో బద్వేలు పెద్ద చెరువుకు నీరు వచ్చి చేరడంతో నీటిని వృథాకాకుండా కాపాడుకోవాలని ఇరిగేషన్ శాఖాధికారులకు సూచించారు. కలెక్టర్ వెంట జడ్పీ సీఈవో ఓబుళమ్మ, ఆర్డీఓ చంద్రమోహన్, బద్వేలు, గోపవరం తహశీల్దార్లు ఉదయభాస్కర్‌రాజు, త్రిభువన్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి, అర్బన్ సీఐ లింగప్ప, నీటిసంఘంచైర్మన్ సురేంద్ర, వైస్ చైర్మన్ వెంకటసుబ్బారెడ్డి, ఇరిగేషన్ డీఈ వేణుగోపాల్‌రెడ్డి, రెవెన్యూ, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

తుఫాన్ ప్రభావిత పాంతాల్లో చర్యలు చేపట్టండి



ఉప్పాగు వంకను పరిశీలిస్తున్న జడ్పీ సీఈవో ఓబుళమ్మ

కాశినాయన అక్టోబరు29(ఆంధ్రజ్యోతి) తుఫాన్ ప్రభావిత ప్రాంతాల్లో సత్వర చర్యలు చేపట్టాలని కడప జడ్పీ సీఈవో ఓబుళమ్మ అధికారులను ఆదేశించారు. తుఫాన్ బాధిత ప్రాంతాల పర్యవేక్షణలో భాగంగా బుధవారం జడ్పీ సీఈవో ఓబుళమ్మ ఎంపీ డీవో మైథిలీరెడ్డితో కలిసి ఉప్పలూరు గ్రామంలో పర్యటించారు. నర్సాపురం-ఉప్పలూరు గ్రామాల మధ్య వర్షం పడిన ప్రతిసారి ఉప్పాగు పొంగి రాక పోకలు నిలిచిపోతున్నాయని స్థానికులు తెలపడంతో వాగును పరిశీలించారు. అనంతరం గ్రామంలో పారిశుధ్యంపై చేపట్టిన చర్యలను పరిశీలించారు. పలువురు ప్రభుత్వ సిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలను అణచి వేయాలి

జమ్మలమడుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మట్కా, క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ బెట్టింగ్, గ్యాంబ్లింగ్ జరుగకుండా కఠిన చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సూచించారు. జమ్మలమడుగు అర్బన్ పోలీసు స్టేషన్‌ను జిల్లా ఎస్పీ నచికేత్ విశ్వనాథ్ సందర్శించారు. డీఎస్పీ వెంకటేశ్వరరావు, పోలీసు సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు వారి సిబ్బంది స్వాగతం పలికారు. ఏర్పాటు చేసిన సీఐ చాంబర్‌లో పోలీసు అధికారులతో జిల్లా ఎస్పీ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ మాట్లాడుతూ రౌడీషీటర్ల కదలికపై నిఘా పెట్టాలన్నారు. పోలీసు సబ్‌డివిజన్ పరిధిలో అధికారులకు దిశ, నిర్దేశ్యం చేశారు. తీవ్రమైన కేసుల గురించి ఆరా తీశారు. సబ్‌డివిజన్ పరిధిలోని జాతీయ రహదారిపై పెట్రోలింగ్ నిర్వహించాలని ఆదేశించారు. రాత్రి సమయంలో నేరాలు జరుగకుండా గస్తీ పెంచాలని సూచించారు.వారానికి సిబ్బందితో సమావేశం నిర్వహిం చాలని సూచించారు. జమ్మలమడుగు పట్టణంలోనేకాకుండా సబ్‌డివిజన్ పరిదిలో సమస్యలు ఏవైనా ఉన్నాయా అంటూ ఎస్పీ, పోలీసు సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. ఎక్కడ సమస్య ఉన్నా వెంటనే తన దృష్టికి తేవాలని ఆదేశించారు. డాక్యుమెంట్లను డిజిటల్ రూపంలో భద్రపరచాలన్నారు. గ్రామాల్లో తనిఖీలు పెంచాలని పోలీసు అధికారులతో వారానికి ఒకసారి సమావేశం నిర్వహించాలన్నారు. అప్పుడే ఆయా ప్రాంతంలో రౌడీ షీటర్ల గురించి, మట్కా, బెట్టింగ్, తదితర సమస్యల గురించి తెలిసిపోతుందన్నారు. అలాగే జమ్మలమడుగులో ఏదైనా అక్రమ రవాణా జరిగినా తన దృష్టికి తేవాలన్నారు. ఈ కార్యక్రమంలో డీఎస్పీ వెంకటేశ్వరరావు, సబ్‌డివిజన్ పరిధిలోని సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

తుఫాన్‌తో నష్టపోయిన రైతులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి

ప్రొద్దుటూరు , అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : గత మూడు రోజులుగా తుఫాను వల్ల కురు స్తున్న వర్షాలతో పంటపొలాలన్నీ నీట మునిగి రైతులు తీవ్రంగా నష్ట పోయారని వారి ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆదుకోవాలని ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక టీడీపీ కార్యా లయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రొద్దుటూరు రాజుపాళెం మండలాల్లో కంది, పత్తి మినుము వేసిన పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయన్నారు. వరిరైతులు కూడా పంట మునకకు గురై నష్టపోయారన్నారు. రాజుపాళెం మండలంలో సత్తువలు ఇత్తుకొ ని వర్షాలకారణంగా శనగ పంట వేయలేక భూమిలో గడ్డి ఏపుగా పెరిగి ఎరువులు నీటిలో కొట్టుకుపాయాయన్నారు. ప్రభుత్వాలు ఉదారంగా రైతులను ఆదుకోవాలన్నారు. ఆమేరకు సీఎం చంద్రబాబుకు లేఖ రాస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ బచ్చల పుల్లయ్య, టీడీపీ మాజీ పట్టణ అధ్యక్షుడు ఘంటశాల వెంకటేశ్వర్లు, మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ చౌడం వెంకటకొండయ్య, మాజీ శివాలయం చైర్మన్ శంకరనాయరాయణ, అవుల రాజేశ్వరరెడ్డిలు పాల్గొన్నారు.

కొత్తపల్లె చానల్ పై ఆక్రమణల తొలగింపు

- వర్షపు నీళ్లు వెళ్లడానికి మార్గం ఏర్పాటు



ఆక్రమణలను యంత్రాలతో తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

ప్రొద్దుటూరు, అక్టోబరు 29 (ఆంధ్ర జ్యోతి): కొత్తపల్లె పంచాయతీలో ఆక్రమణలకు గురైన కొత్తపల్లె చానల్‌ను ఎమ్మెల్యే వరదరాజురెడ్డి ఆదేశాలతో మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి ఆధ్వర్యంలో టౌన్ ప్లానింగ్ అధికారులు కాలువ పై ఆక్రమణల తొలగింపు చర్యలుచేపట్టారు. బుధవారం ఈఈ శ్రీనివాసులు టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగరాజు, టీపీవో చంద్రమోహన్‌లు ఆక్రమించి పూడ్చివేసిన కొత్తపల్లె కాలువను ఎక్స్‌కవేటర్‌తో తవ్వి సినీహబ్‌నుంచి వర్షపు నీటిని కొత్తపల్లె కాలువ ద్వారా ఊరిబయటకి తీసుకెళ్లే చర్యలు చేపట్టారు. సినిహబ్ నుంచి అపోలో టైర్స్‌వరకు ఉన్న కచ్చాకాలువలో పూడిక వల్ల సినీహబ్ వద్ద రోడ్డులెవెల్స్‌కు కాలువనీళ్ల పారుతున్నాయి. వాటిని సైతం తొలగించేలా చర్యలు తీసుకోమని ఎమ్మెల్యే కమిషనర్‌ను ఆదేశించడంతో కచ్చాకాలువలో కూడా పూడిక తీస్తామని కమిషనర్ తెలిపారు.

మర్రిమాను చెరువు గండికి అడ్డుకట్ట

అట్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని కొండూరు పడమటి భాగాన మర్రిమాను చెరు వుకు గండి పడడంతో నీటిని అదుపు చేసేందుకు ఇరిగేసన్ డీఈ వేణుగోపా లెరెడ్డి యంత్రాలతో తాత్కాలికంగా అడ్డుకట్ట వేశారు. అయితే మొంథా తుఫానుతో సోమ, మంగళవారాల్లో వర్షం ఏకధాటిగా కురవడంతో మరలా గండి పడింది. దీంతో మర్రిమాను చెరు వు ఆయకట్టు ఉపాధ్యక్షుడు వెంకటసుబ్బయ్య, డీఈ వేణుగోపాల్‌రెడ్డిలు బుధవారం రెండు ఎక్స్‌కవేటరుతో గండి పడిన చోట అడ్డుకట్టవేశారు. కార్యక్రమంలో ఎస్‌ఐ రామ క్రిష్ణ, ఏఈ రాజశేఖర్, టీడీపీ నాయకుడు అమర్‌నాథరెడ్డి, స్థానిక వీఆర్వో దొరబాబు, సచివాలయ అసిస్టెంట్ సంపత్‌కుమార్, వీఆర్‌ఏ శ్రీనివాసులు పాల్గొన్నారు.

వర్షాలతో పంటలకు తీవ్రనష్టం

కాశినాయన అక్టోబరు29(ఆంధ్రజ్యోతి)మొంథా తుఫాన్‌తో పంటలు దెబ్బతిని తీవ్ర నష్టం కలిగిందని ప్రభుత్వం వెంటనే రైతులను ఆదుకోవాలని బద్వేల్ నియోజకవర్గ వైసీపీ అదనపు సమన్వయకర్త ఎస్.విశ్వనాథ్‌రెడ్డి కోరారు. బుధవారం ఆయన మండలంలోని కోడిగుడ్లపాడు, వడ్డమాను, చిన్నాయపల్లె తదితర గ్రామాల్లో పర్యటించి వర్షానికి దెబ్బతిన్న ఉల్లి, వరి, మిరప, పత్తి తదితర పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో గంగనపల్లె సర్పంచ్ ప్రభాకర్‌రెడ్డి, జయరావ్, రైతులు పాల్గొన్నారు.

చేనేతలను ఆదుకోవాలి

జమ్మలమడుగు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ప్రస్తుతం కురుస్తున్న వర్షాల వలన నష్టపోయిన చేనేత కార్మికులను ప్రభుత్వం వెంటనే ఆదుకోవాలని చేనేత కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శివనారాయణ తెలిపారు. బుధవారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మొంథా తుఫాను కారణంగా నియోజకవర్గంలోని చేనేత కార్మికులు పనులు లేక మగ్గపు గుంతల్లో కొన్ని చోట్ల నీరు నిలిచాయన్నారు. ఈ కార్యక్రమంలో చేనేత కార్మిక సంఘం నాయకులు సంజీవరాయుడు, కొండయ్య, లక్ష్మినారాయణ, గొరిగె కృష్ణ, శేషయ్య, బాలసుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

తాగునీటి కోసం ఆందోళన

ముద్దనూరు అక్టోబరు29(ఆంధ్రజ్యోతి):మండల కేంద్రంలోని పెద్దమ్మతల్లి వీధిలో త్రాగునీరు రాలేదని మహిళలు ఆందోళనరు.స్థానిక మేజర్ గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద బుధవారం మహిళలు డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడుతో సమస్యను విన్నవించుకున్నారు. 20రోజులుగా వీధిలో త్రాగు నీటి రాక ఇబ్బందుపడుతున్నామన్నారు.సమస్యను నాలుగు రోజుల క్రితం గ్రామ పంచాయతీ ఈవో లక్ష్మినరసింహులుకు తెలిపినా పరిష్కరించలేదన్నారు.తమకు తాత్కాలికంగా ట్యాంకర్లతోనైనా నీరందించాలన్నారు.కాగా నీటి సమస్యను వారం రోజుల్లో పరిష్కరిస్తా మని ,డిప్యూటీ ఎంపీడీవో వీరభద్రుడు హామీ ఇచ్చారు.

చెరువులకు జలకళ

కలసపాడు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): భారీ వర్షాలకు మండల వ్యాప్తంగా చెరువులకు జలకళ వచ్చింది. రాచ్చెరువు, తడుకు చెరువులు నిండు కుండలామారి అలుగులు పారుతున్నాయి. ఎగువ కురిసన భారీ వర్షాలతో పాటు స్థానిక చెరువులు, కుంటలు, చెక్‌డ్యామ్‌లు పొంగి ప్రవహిస్తుండడంతో సగిలేరు ఉప్పొంగింది.

బాధితులకు పునరావాసం

పోరుమామిళ్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): తుఫాను తాకిడికి దెబ్బతిని నిరాశ్రయులకు రెవెన్యూ అధికారులు ఆశ్రయం కల్పించారు. మండంలోని బొప్పాపురం గ్రామంలో గృహాలు దెబ్బతినడంతో 9 మంది నిరాశ్రయుల య్యారు. విషయం తెలుసుకున్న ఆర్ఐ సుధాకర్‌రెడ్డి చర్చిలో పునరావాసం కల్పించి వసతులు ఏర్పాటు చేశారు. అలాగే అక్కల్‌రెడ్డిపల్లె సమీపంలో నాలుగు యానాది కుటుంబాల వారు నిరాశ్రయులు కావడంతో వారికి కూడా వారికి ఆశ్రయం కల్పించి చర్యలు తీసుకోవాలని వీఆర్వోను ఆదేశించారు

మొంథా వల్ల ఎర్రగుంట్లకు తప్పిన ముప్పు



కలమల్లలో పర్యటిస్తున్న ఎంపీడీవో వెంకటరమణయ్య

ఎర్రగుంట్ల, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాన్‌వల్ల ఎర్రగుంట్ల మండలానికి భారీ ముప్పు తప్పింది. భారీ వర్షాలు కురుస్తాయని హెచ్చరించినప్పటికి వర్షాలు తక్కువగానే పడ్డాయి. మండలంలోని మాలేపాడులో ఒక గేదె చనిపోగా, హనుమనగుత్తిలో గోడ కూలిన ఘటన జరిగినట్లు అధికారులు వెల్లడించారు. అయితే భారీ వర్షాల కారణంగా రోడ్లు బాగా దెబ్బతిన్నాయి. అలాగే చిన్నదండ్లూరు, ఇల్లూరు ప్రాంతంలో వేసిన వరిపంటకు భారీ నష్టం వాటిల్లినట్లు రైతులు పేర్కొంటున్నారు. తుఫాన్‌పై అధికారులు ముందస్తు చర్యలు చేపట్టారు. మండల స్పెషలాఫీసర్ కిరణ్‌కుమార్ బుధవారం తహసీల్దార్ శోభన్‌బాబు, ఇతర అధికారులతో రివ్యూ చేశారు. ఎంపీడీవో వెంకటరమణయ్య గ్రామాల్లో పర్యటించి నష్టాలపై ఆరా తీశారు.

అమరవీరులకు నివాళిగా రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న సీఐలు

మైదుకూరు అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాలలో భాగంగా జిల్లా ఎస్పీ షెల్కే నచికేత్ విశ్వనాద్ ఆదేశాల మేరకు మైదుకూరు ప్రభుత్వ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రక్తదాన శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరంలో మైదుకూరు పట్టణ సీఐ రమణారెడ్డి, రూరల్ సీఐ శివశంకర్, ఖాజీపేట సీఐ వంశీధర్, ఎస్‌ఐ చిరంజీవిలు రక్తదానం చేశారు.ఈ సందర్భంగా డీఎస్పీ రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ పోలీసు అమరవీరుల త్యాగాలకు నివాళిగా రక్తదాన శిబిరం నిలుస్తుందన్నారు. ఈ శిబిరంలో 50 మంది పోలీసు సిబ్బంది, యువత, రక్తదానం చేశారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరికీ డీఎస్పీ అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ డైరెక్టర్ యాపరాల చిన్న, బద్వేల్ అర్బన్ సీఐ లింగన్న, రూరల్ సీఐ కృష్ణయ్య, ఎస్‌ఐ సుబ్బారావు,పోలీసు సిబ్బంది, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

మట్కా బీటర్లు అరెస్టు

మైదుకూరు అక్టోబరు29(ఆంధ్రజ్యోతి): పట్టణంలో ఇద్దరు మట్కా బీటర్లను అరెస్టు చేసినట్లు సీఐ రమణారెడ్డి తెలిపారు.స్థానిక బద్వేల్ రోడ్డుకు చెందిన మహమద్ షాష,షేక్ కరీముల్లాలు వనిపెంట రోడ్డులో మట్కా రాస్తుండగా మైదుకూరు పట్టణ సీఐ వారిని పట్టుకొని వారి వద్ద ఉన్న రూ.4800 లను స్వాదీనం చేసుకొని కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

రాజుపాలెం వద్ద కుందూ ఉగ్రరూపం



టంగుటూరు బ్రిడ్జిపై పొర్లుతున్న కుందూ

రాజుపాలెం, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): ఎడతెరిపి లేకుండా వర్షాలు పడడంతో కుందూ ఉగ్రరూపం దాల్చింది. కుందూలో 34వేల క్యూసెక్కుల నీరు ప్రవహిస్తుండడంతో ఇరుపక్కల ఉండే పంటపొలాలు, విద్యుత్ మోటార్లు నీటమునిగాయి. ఇంకా ప్రవాహం పెరిగే అవకాశం ఉన్నందున లోతట్టు ప్రాంతాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని గ్రామాల్లో దండోరా ద్వారా సమాచారం ఇస్తున్నారు. కుందూకు ఇరుపక్కలా సాగైన వరి పంట వర్షం ధాటికి నేలకు ఒరుగుతోంది. శెనగ పంట సాగు చేసుకునేందుకు దాదాపు 10వేల ఎకరాల్లో 20 రోజుల క్రితం ఎరువులు విత్తుకుని సిద్దంగా ఉన్న రైతులకు వర్షం కన్నీరు మిగిల్చింది. వర్షం నీరు నిల్వలు ఉండడంతో వేసిన సత్తువలన్నీ గడ్డికే పోతోందని ఇంకా పదిరోజులకు కానీ విత్తనం వేసే పరిస్థితి లేదని రైతులు తెలిపారు. మునిగిన మినుము, నూగు, కందిపంటలను పరిశీలించి సహాయం అందించాలని పలువురు రైతులు కోరుతున్నారు.

దువ్వూరు వద్ద పెరిగిన నీటి ప్రవాహం



దువ్వూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): కుందూ నదిలో నీటి ప్రవాహం పెరిగింది. మంగళవారం రాజోలి ఆనకట్ట వద్ద 11 వేల క్యూసెక్కుల నీటి ప్రవాహం బుధవారం 30 వేల క్యూసెక్కులకు పెరిగింది. పైతట్టు వర్షపునీరు కుందూలో దిగువకు చేరుతుండడంతో ఇక్కడ ఒక్కరోజులోనే 19 వేల క్యూసెక్కులు పెరిగింది. దీనికితోడు ఈ ప్రాంతంలోని పైతట్టు వర్షపునీరంతా కుందూలోని చేరుతుండడంతో నది నిండుగా ప్రవహిస్తోంది. దువ్వూరులో చెరువులోకి సైతం అధికంగా నీరు వస్తుండడంతో నిండుకుండను తలపిస్తోంది. ఈ నేపథ్యంలో ఇరిగేషన్ అధికారులు ఎప్పటికప్పుడు పరిస్థితులను సమీక్షించారు. చెరువు పరిసర ప్రాంతాల్లో పంటలు కొన్ని చోట్ల మునకకు గురయ్యాయి. సంబంధిత రైతులు తీవ్ర ఆందోళన చెందారు.

సగిలేరు వంతెనపై రాకపోకలకు అడ్డుకట్ట

అట్లూరు, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వేములూరు సమీ పంలో సగిలేరు వంతెనపై నీరు ప్రవహిస్తున్నందున ఎవరూ అటు వైపు వెళ్లకుండా బుధవారం ముళ్లకంపను అడ్డుకట్టగా వేసినట్లు తహసీల్దారు సుబ్బలక్షుమ్మ తెలిపారు. మొంథా తుఫాను కారణంగా సోమ, మంగళవారాల్లో ఏకథాటిగా కురిసిన వర్షానికి సగిలేరు వంతెనపై జలాలు తీవ్రంగా పెరగడంతో జనాలు వంతెన పైకి వెళ్లకుండా ఉండేందుకు అడ్డుకట్ట వేయడం జరిగిందని తహసీల్దారు తెలిపారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అలుగు నీటిని పరిశీలిస్తున్న ఎంపీడీవో దివిజా సంపతి

ఖాజీపేట, అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి): మొంథా తుఫాను వలన కురిసిన వర్షపు నీటి ప్రవాహానికి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎంపీడీవో దివిజా సంపతి అన్నారు. బుధవారం మండల పరిధిలోని చెముళ్లపల్లె చెరువును కన్నెలవాగు చెరువు అలుగు నీటిని పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ చెరువు నీరు అధికంగా రావడంతో చెముళ్లపల్లె గ్రామానికి రాకపోకలకు ఇబ్బందిగా ఉందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ వెంకటరామిరెడ్డి, సెక్రటరి రామకృష్ణారెడ్డి, వెల్ఫేర్ అసిస్టెంట్ సుబ్బారెడ్డి, ఇంజనీరింగ్ అసిస్టెంట్ అంజి, వీఆర్వో ఓబులేసు, అగ్రికల్చరల్ ఆఫీసర్ అరుణ్‌కుమార్ రెడ్డి, ట్రెజరర్ పాల్గొన్నారు.

బైపాస్ రోడ్డులో ఆటోబోల్తా



ప్రొద్దుటూరు , అక్టోబరు 29 (ఆంధ్రజ్యోతి) : ప్రొద్దుటూరు పట్టణం ఎర్రగుంట్ల బైపాస్ రోడ్డులో వర్షాలకు గుంతలు పడడంతో బుధవారం ఒక ఆటో గుంతల్లో వెళ్లలేక బోల్తా పడింది. సినీహబ్ దగ్గర జరిగిన ఈ ఆటో ప్రమాదంతో రోడ్డుకు ఇరువైపుల వాహనాలు నిలబడి ట్రాఫిక్ కొంతసేపు ఇబ్బంది కలిగింది. ఈ రోడ్డులో ప్రయాణం నరక ప్రాయంగా మారిందని తరుచు ప్రమాదాలు జరుతున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఈ బైపాస్ రోడ్డును నాలుగు లైన్ల రహదారిగా విస్తరించడానికి పనులు ప్రారంభమయ్యాయని అధికారులు వెల్లడిస్తున్నారు.